



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 199 | శుక్రవారం 09 జనవరి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## వీధి కుక్కలు భయాన్ని పసిగడతాయి...

- భయపడేవాళ్లపైనే ఎక్కువగా దాడి చేస్తాయి: సుప్రీంకోర్టు
- వీధి కుక్కల నియంత్రణ కేసు విచారణలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- మనిషి భయాన్ని కుక్కలు పసిగడతాయని, భయపడితే దాడి చేస్తాయని వ్యాఖ్య
- ఎలుకల నియంత్రణకు కుక్కలు అవసరమన్న స్వచ్ఛంద సంస్థల వాదన

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

కుక్కలకు బదులు పిల్లులను పెంచొచ్చు కదా అని సరదాగా వ్యాఖ్యానించిన ధర్మాసనం మనిషిలోని భయాన్ని కుక్కలు సులభంగా పసిగట్టగలవని, భయపడే వ్యక్తులపైనే అవి ఎక్కువగా దాడి చేస్తాయని సుప్రీంకోర్టు గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. వీధి కుక్కల నిర్వహణపై సుమోటోగా స్వీకరించిన కేసు విచారణ సందర్భంగా జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. పాఠశాలలు, ఆసుపత్రులు, బస్టాండ్లు వంటి ప్రజా ప్రాంగణాల్లో పట్టుకున్న వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేశాక తిరిగి అదే ప్రాంతంలో వదిలిపెట్టవద్దని 2025 నవంబర్‌లో



ఇచ్చిన ఆదేశాలను సవరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సమయంలో, "మీరు భయపడుతున్నారని తెలిస్తే కుక్కలు

- మిగతా 2లో..



## 'అన్వేష'తో 2026కి శ్రీకారం...

- మరో ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతున్న ఇస్రో
- 2026 తొలి ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో
- ఈ నెల 12న పీఎస్ఎల్వీ-సీ62 ద్వారా జుూా-చీ1 ఉపగ్రహ ప్రయోగం
- వ్యవసాయం, పర్యావరణ పర్యవేక్షణ కోసం 'అన్వేష'

2

## అమరావతిని బెస్ట్ సిటీగా తీర్చిదిద్దుతా

- విజయవాడలో 'అమరావతి-ఆవకాయ' ఫెస్టివల్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- అమరావతి బెస్ట్ సిటీగా ఎదుగుతుందని, ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేసిన సీఎం
- గత ఐదేళ్లలో పండుగలు లేక ప్రజల్లో నవ్వులు కరువయ్యాయని విమర్శ
- తెలుగు సినిమా, సంస్కృతి, రుచుల వైభవాన్ని చాటిచెప్పడమే ఉత్సవాల లక్ష్యం
- విశాఖను ఏఐ హబ్‌గా, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీని ఏర్పాటు చేస్తామని ప్రకటన

విజయవాడ - సూర్య వాస్తవం

తెలుగు సంస్కృతి, సినిమా, సాహిత్యం, కళలు, రుచుల సమ్మేళనంగా విజయవాడలో 'అమరావతి-ఆవకాయ ఫెస్టివల్ 2026' అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. పున్నమిఘాట్‌లోని ప్రధాన వేదికపై మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణా నదిలో నూతనంగా ఏర్పాటు చేసిన హౌస్ బోట్లను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, అమరావతి దేవతల రాజధాని అని, వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. ఎంతమంది ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎవరు ఎంత బాధపడినా అమరావతిని దేశంలోనే బెస్ట్ సిటీగా, డైనమిక్ సిటీగా తీర్చిదిద్ది తీరుతామని ధీమా



వ్యక్తం చేశారు. విజయవాడను అత్యంత పరిశుభ్రమైన నగరంగా (క్లీనెస్ట్ సిటీ), అమరావతిని పచ్చని నగరంగా (గ్రీన్ సిటీ) మారుస్తామని హామీ ఇచ్చారు. కృష్ణా నది ఒడ్డున గంట సేపు గడిపితే ఎలాంటి

- మిగతా 2లో..



## చంద్రబాబు ఒక్కరే మన నాయకుడు

- తాను కూడా పార్టీకి ఒక సైనికుడినేనని నారా లోకేశ్ ఉద్ఘాటన
- వచ్చే ఎన్నికల్లో గెలిచి చరిత్రను తిరగరాయాలని పిలుపు
- ప్రతి మూడు నెలలకు నేతల పనితీరుపై సమీక్ష ఉంటుందని హెచ్చరిక
- కూటమి పార్టీలతో కలిసి 15 ఏళ్ల పాటు ముందుకు సాగాలని సూచన

అమరావతి - సూర్య వాస్తవం

"తెలుగుదేశం పార్టీలో మనందరిదీ ఒకటే లైన్, ఒకటే అజెండా ఉండాలి. మన నాయకుడు, పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఒక్కరే. నాతో సహా మిగతావారంతా సైనికులం మాత్రమే. నేను కూడా తెలుగుదేశం పార్టీకి

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## వికసిత్ భారత్ అంటే పేదల పొట్టగొట్టడమేనా?

- అంబానీ..అదానీల కోసమే 'నరేగా'లో మార్పులు
- కార్పొరేట్లకు కారు చౌకగా కూలీలను పంపేందుకు కేంద్రం కుట్రలు
- దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాల్సిందే
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఊరుకోం : ప్రధాని మోడీపై ఫైర్
- 'ఉపాధి'ని పునరుద్ధరించే వరకు పోరాడతామని ప్రతిజ్ఞ
- బీజేపీ విధానాలతో దేశానికి నష్టం
- టీపీసీసీ విస్తృత కార్యవర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి
- రాహుల్ గాంధీని ప్రధానిని చేయాల్సిన అవసరముందని వ్యాఖ్య

హైదరాబాద్ - సూర్య వాస్తవం

కేంద్ర ప్రభుత్వం అంబానీ, అదానీల కోసమే మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (నరేగా)లో మార్పులు చేసిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



అన్నారు. వారికి కారుచౌకగా కూలీలను పంపేందుకే ఇలాంటి కుట్రలకు పాల్పడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఉధృత పోరాటాలు నిర్వహించటం ద్వారా ఈ విషయంలో ప్రధాని మోడీతో ప్రజలకు క్షమాపణలు చెప్పిస్తామని వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్ అంటే పేదల పొట్టగొట్టటమేనా? అని సీఎం ప్రశ్నించారు. ఉపాధి చట్టాన్ని పునరుద్ధరించే వరకు పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. బీజేపీ విధానాలతో దేశానికి తీవ్ర నష్టమని, అందువల్ల రాహుల్ గాంధీని ప్రధానిని చేయటమే తక్షణ అవసరమని నొక్కి చెప్పారు. ఇందుకనుగుణంగా కాంగ్రెస్‌కు చెందిన ప్రతీ కార్యకర్త కంకణబద్ధులై పని చేయాలని పిలుపునిచ్చారు గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు

- మిగతా 2లో..



## ప్రభుత్వ తీరుతో రాయలసీమకు తీరని నష్టం

- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అమరావతి - సూర్య వాస్తవం

రాయలసీమ లిఫ్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంతో ఆ ప్రాంతానికి తీరనినష్టం జరుగుతోందని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ విధానం ఇదే మాదిరి కొనసాగితే భవిష్యత్తులో తాగడానికి నీరు కూడా అందని పరిస్థితి

- మిగతా 2లో..

# వీధి కుక్కలు భయాన్ని పసిగడతాయి...

(మొదటిపేజీ తరువాయి)
దాడి చేసే అవకాశం ఎక్కువ. ఇది మా వ్యక్తిగత అనుభవం" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా ఓ స్వచ్ఛంద సంస్థ తరపున సీనియర్ న్యాయవాది సీయూ సింగ్ వాదనలు వినిపిస్తూ, ఎలుకల జనాభాను నియంత్రించడంలో కుక్కలు పర్యావరణ సమతుల్యతకు సహాయపడతాయని తెలిపారు. కుక్కలను హఠాత్తుగా తొలగిస్తే ఎలుకల బెడద పెరుగుతుందని, గతంలో సూరత్‌లో ఇలాగే జరిగిందని గుర్తుచేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. కుక్కల తొలగింపునకు, ఎలుకల పెరుగుదలకు మధ్య నిర్దిష్ట సంబంధం ఉందా అని ప్రశ్నించింది. సరదాగా వ్యాఖ్యానిస్తూ, "ఎలుకలను పిల్లులు బాగా వేటాడతాయి. కాబట్టి కుక్కలను తగ్గించి, పిల్లులను పెంచితే సమస్య తీరొచ్చు కదా?" అని పేర్కొంది. పీపుల్ ఫర్ ఎథికల్ ట్రీట్‌మెంట్ ఆఫ్ యానిమల్స్ (గ్రాజుూూా) తరపున న్యాయవాది శ్యామ్ దివాన్ వాదిస్తూ, యానిమల్ బర్త్ కంట్రోల్ (గూదీజ) నిబంధనల ప్రకారం పట్టుకున్న కుక్కలను అదే ప్రాంతంలో తిరిగి వదిలిపెట్టాలని తెలిపారు. కుక్కలను షెల్టర్లలో ఎక్కువ కాలం బంధించడం క్రూరత్వం అవుతుందని అన్నారు. ఈ కేసులో కుక్కల ప్రేమికులు, జంతు హక్కుల కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, కుక్కకాటు బాధితులు సహా అన్ని వర్గాల వాదనలను సుప్రీంకోర్టు వింటోంది.

# 'అన్వేష'తో 2026కి శ్రీకారం...

**- మరో ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతున్న ఇస్రో**
**- 2026 తొలి ప్రయోగానికి సిద్ధమైన ఇస్రో**
**- 12న పీఎస్ఎల్వీ-సీ62 ద్వారా ఈవోఎస్-1 ఉపగ్రహ ప్రయోగం**
**- వ్యవసాయం, పర్యావరణ పర్యవేక్షణ కోసం 'అన్వేష'**

విజయవాడ - సూర్య వాస్తవం
భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) 2026 సంవత్సరంలో తన తొలి ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఈ నెల 12వ తేదీన ఉదయం 10:17 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్‌ను ప్రయోగించనున్నట్లు ఇస్రో ప్రకటించింది. ఈ ప్రయోగం ద్వారా ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ (జుూూా-చీ1)తో పాటు మరో 15 చిన్న ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు.
ఈ మిషన్‌లో ప్రధాన ఉపగ్రహమైన జుూూా-చీ1కు 'అన్వేష' అని కూడా పేరు పెట్టారు. వ్యవసాయం, పట్టణ ప్రణాళిక, పర్యావరణ పర్యవేక్షణ వంటి కీలక రంగాలలో దేశ సామర్థ్యాన్ని పెంచడానికి ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. "రాకెట్, ఉపగ్రహాల అనుసంధాన ప్రక్రియ పూర్తయింది. ప్రయోగానికి ముందు జరగాల్సిన తనిఖీలు కొనసాగుతున్నాయి" అని ఇస్రో ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ప్రయోగంలో స్పెయిన్‌కు చెందిన ఒక స్టార్టప్ అభివృద్ధి చేసిన 'కెస్ట్రెల్ ఇనీషియల్ టెక్నాలజీ డెమాన్‌స్ట్రేటర్ణ (ఖ×ఱ) అనే ఒక చిన్న రీ-ఎంట్రీ వాహనాన్ని కూడా పరీక్షిస్తున్నారు. అన్ని ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టిన తర్వాత ఇది భూ వాతావరణంలోకి తిరిగి ప్రవేశించి దక్షిణ పసిఫిక్ మహాసముద్రంలో కూలిపోనుంది.
పీఎస్ఎల్వీ రాకెట్‌కు ఇది 64వ ప్రయోగం కాగా, రెండు స్ట్రాప్-ఆన్ మోటార్లు కలిగిన పీఎస్ఎల్వీ-డీఎల్ వేరియంట్‌తో ఇది ఐదో ప్రయోగం. చంద్రయాన్-1, మార్స్ ఆర్బిటర్ మిషన్, ఆదిత్య-ఎల్1 వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక ప్రయోగాలను పీఎస్ఎల్వీ విజయవంతంగా పూర్తి చేసింది. కాగా, గత ఏడాది మే నెలలో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ61 ప్రయోగం సాంకేతిక లోపం కారణంగా విఫలమైన విషయం తెలిసిందే.

# చంద్రబాబు ఒక్కరే మన నాయకుడు

ఒక సైనికుడినే" అని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీలో నాయకత్వంపై ఎలాంటి సందిగ్ధతకు తావులేదని, చంద్రబాబు నాయకత్వంలోనే అందరూ పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో నూతనంగా నియమితులైన పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జోనల్ కోఆర్డినేటర్లతో లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ భవిష్యత్ కార్యాచరణ, క్రమశిక్షణ, నాయకుల బాధ్యతలపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు.వచ్చే ఎన్నికల్లో గెలిచి చరిత్రను తిరగరాయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని లోకేశ్ అన్నారు. "1999లో మాత్రమే మనం వరుసగా రెండోసారి గెలిచాం. ఆ చరిత్రను పునరావృతం చేయాలి. సొంతిల్లు కంటే కిరాయి ఇల్లుపై దృష్టి పెట్టే ధోరణికి ఫుల్ స్టాప్ పడాలి. పార్టీ ప్రయోజనాలే అందరికీ శిరోధార్యం కావాలి" అని ఆయన పిలుపునిచ్చారు. పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల పనితీరును ప్రతి మూడు నెలలకోసారి సమీక్షిస్తామని, ఈ నిబంధన రాష్ట్ర కమిటీకి కూడా వర్తిస్తుందని తేల్చిచెప్పారు. తీసుకునే పది నిర్ణయాల్లో మూడు తప్పులు జరిగినా, వాటిని సరిదిద్దుకుని ముందుకు సాగాలని సూచించారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను ప్రతిఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని లోకేశ్ ఆదేశించారు. "పార్టీ అనేది ఒక వ్యవస్థ, వ్యక్తులపై ఆధారపడకూడదు. అందరూ సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి. 'మై టీడీపీ' యాప్ ద్వారా వచ్చే ఆదేశాలను కచ్చితంగా అమలుచేయాలి. మంగళగిరి విజయమే ఇందుకు నిదర్శనం" అని వివరించారు. కష్టపడి పనిచేసే ఉత్తమ కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇచ్చామని, పనిచేసే వారిని పార్టీ గుర్తిస్తుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గాల్లో ప్రజాదర్బార్, కార్యకర్తల సమావేశాలు నిర్వహించేలా చూడాల్సిన బాధ్యత కొత్త కమిటీలపై ఉందని గుర్తుచేశారు. ముమ్మందు పార్టీ కార్యక్రమాల వేగం మరింత పెంచుతానని, పార్టీ కోసం పూర్తి సమయం కేటాయిస్తానని లోకేశ్ తెలిపారు. కూటమి పార్టీలతోనూ సమన్వయం చేసుకోవాలని, నెలకోసారి వారితో సమావేశం కావాలని సూచించారు. "మనం 15 ఏళ్ల పాటు కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. సోషల్ మీడియాపైనా దృష్టిసారించాలి" అన్నారు. వచ్చే ఏడాది చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి సిద్ధంగా ఉండాలని కోరారు. 75 ఏళ్ల వయసులోనూ చంద్రబాబు కార్యకర్తలను స్వయంగా కలుస్తున్నారని, కానీ జగన్ రెడ్డి మాత్రం పరదాలు కట్టుకుని తిరిగారని విమర్శించారు. పార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాత అందరూ దాన్ని పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో పాటు జోనల్ కోఆర్డినేటర్లు మంతెన సత్యనారాయణ రాజు, భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, బీదా రవిచంద్ర యాదవ్, సుజయ్ కృష్ణ రంగారావు, దీపక్ రెడ్డి, కోవెలమూడి రవీంద్ర, వేపాడ చిరంజీవి రావు, మండలపు రవి, పెళ్లకూరు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిని బెస్ట్ సిటీగా తీర్చిదిద్దుతా

(మొదటిపేజీ తరువాయి)
ధ్యానం అవసరం లేదని, అంతటి ప్రశాంతత ఇక్కడ ఉందని ఆయన పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో పండుగలు, సంబరాలు కనుమరుగై ప్రజల ముఖాల్లో నవ్వులు కరవయ్యాయని చంద్రబాబు విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజయవాడలో విజయ ఉత్సవ్, దసరా వేడుకలను ప్రపంచస్థాయిలో నిర్వహించామని గుర్తుచేశారు. ఒకప్పుడు దసరా అంటే మైసూరు, కలకత్తా గుర్తుకొచ్చేవని, ఇప్పుడు విజయవాడ పేరు వినిపించేలా చేశామని అన్నారు. ఆవకాయ అనగానే ప్రపంచవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ గుర్తుకొస్తుందని, భారతదేశంలో ఫుడ్ అంటే ఆంధ్రప్రదేశ్ అనే స్థాయికి మన వంటకాల ఖ్యాతి ఉందని కొనియాడారు. తెలుగు సినిమా వైభవాన్ని ప్రస్తావిస్తూ, 'భక్త ప్రహ్లాద' నుంచి 'బాహుబలి' వరకు తెలుగు చిత్రసీమ ఎన్నో శిఖరాలను అధిరోహించిందని అన్నారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, శోభన్‌బాబు వంటి మహానటులు కృష్ణా జిల్లా నుంచే వచ్చి చిత్రసీమకు దిక్సూచిగా నిలిచారని, నేడు పవన్ కల్యాణ్, బాలకృష్ణ వంటి వారు దాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. సంపద సృష్టిలో, వ్యాపార చతురతలో కృష్ణా జిల్లా ప్రజలు ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, విశాఖపట్నాన్ని ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతామని, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ద్వారా ఇళ్లలోనే గ్యాస్ తయారుచేసుకునే సాంకేతికతను అందుబాటులోకి తెస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోవని, పర్యాటకం, సాంకేతికతతో మరిన్ని ఉద్యోగాలు సృష్టిస్తామని భరోసా ఇచ్చారు. ఈ ఉత్సవాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత విజయవాడ ప్రజలదేనని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తదితరులు పాల్గొన్నారు.



# వికసిత్ భారత్ అంటే పేదల పొట్టగొట్టడమేనా?

(మొదటిపేజీ తరువాయి)
మహేశ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ఆ పార్టీ విస్తృత కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు.
ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోని 80 శాతం మంది ప్రజలు ఉపాధి చట్టంలో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. ఇంతటి కీలకమైన చట్టంలో మార్పులు చేయటం ద్వారా మోడీ ప్రభుత్వం పేదల పొట్టగొడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెట్టిచాకిరీని నిర్మూలించి, దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి, ఓటు హక్కును అందించిన చరిత్ర మహాత్మాగాంధీ, అంబేద్కర్‌లదని గుర్తుచేశారు. ఆ చరిత్రను వక్రీకరించేందుకు బీజేపీ యత్నిస్తోందని, అందులో భాగంగానే 'ఉపాధి' చట్టంలో మహాత్ముని పేరును తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో 400 సీట్లు సాధించటం ద్వారా రాజ్యాంగాన్ని మార్చేందుకు, తద్వారా అంబానీ, అదానీలకు దేశాన్ని అప్పగించేందుకు కాషాయ పరివారం కుయుక్తులు పన్నిందని దుయ్యబట్టారు. అయితే ప్రజలను అప్రమత్తం చేసిన తమ పార్టీ.. అలాంటి కుట్రలను అడ్డుకుందని చెప్పారు. మూడోసారి అధికారంలోకి వచ్చాక బీజేపీ ఓటు ప్రక్షాళన పేరుతో 'సర్' కార్యక్రమాన్ని తెచ్చి పేదలు, మైనార్టీల ఓటు హక్కును తొలగించేందుకు ప్రయత్నిస్తోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. అదే జరిగితే పేదలకు రేషన్ కార్డు, ఆధార్ కార్డుతోపాటు సంక్షేమ కార్యక్రమాలు అందకుండాపోతాయని హెచ్చరించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఎవరెవరు అధికారంలో ఉండాలనే దాన్ని నిర్ణయించే అధికారం తనకే ఉండాలని బీజేపీ భావిస్తోందని విమర్శించారు.' దేశంలో వికసిత్ భారత్ ఎక్కడుంది?' అని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రశ్నించారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ చట్టాన్ని రద్దు చేసి తెచ్చిన 'వీబీజీరామ్‌జీ' పేరులోనే గందరగోళముందని ఎద్దేవా చేశారు. తెలుగు రాష్ట్రాల వేదికగా వచ్చిన ఉపాధి హామీ చట్టం పేదల ఆత్మగౌరవాన్ని పెంచిందనీ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గతంలో మోడీ తెచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి రాహుల్ గాంధీ విజయం సాధించారనీ, దేశ రైతులకు మోడీతో క్షమాపణలు చెప్పించారని ఆయన గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల మొదటి రోజు రాష్ట్ర ఎంపీలు కేంద్రం ముందు నిరసన గళం విప్పాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

**ఇంటింటి ప్రచారం**

వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో అన్ని చోట్ల కాంగ్రెస్ జెండా ఎగరాలని సీఎం ఆకాంక్షించారు. సర్పంచ్ ఎన్నికల్లో సమిష్టి కృషితో 66శాతం సీట్లను గెలుచుకున్నామని గుర్తు చేశారు. కార్యకర్తల కష్టార్జితంతోనే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచామని, ప్రస్తుతం ఆ కార్యకర్తలను గెలిపించుకునే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. వారి గెలుపు కోసం తాను ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తానని తెలిపారు.

**ములుగు సభకు సోనియా, రాహుల్, ప్రియాంక**

ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీ, కౌన్సిల్ తీర్మానం చేశాయని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. కేంద్రం చర్యలకు నిరసనగా ఈనెల 20 నుంచి 30 వరకు ప్రతీ గ్రామంలో గ్రామసభ ఏర్పాటు చేసి కొత్త చట్టానికి వ్యతిరేకంగా తీర్మానం చేయాలని ఆయన సూచించారు. ఇందుకోసం అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు బాధ్యత తీసుకుని పని చేయాలని ఆదేశించారు. ప్రతి మండలానికి ఒక ఇన్‌చార్జిని నియమించాలని సూచించారు. తాను కూడా ఒక మండల బాధ్యత తీసుకుంటానని తెలిపారు. ఫిబ్రవరి 3 నుంచి అన్ని జిల్లాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహిస్తామని చెప్పారు. ములుగులో ఏర్పాటు చేయబోయే బహిరంగ సభకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీని ఆహ్వానించనున్నట్టు ఆయన తెలిపారు.

**విదేశాలను ఆకర్షించిన నరేగా : టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్**

'నరేగా' విదేశీయులను సైతం ఆకర్షించి, ఆ చట్టం వివరాలను తెలుసుకునేలా చేసిందని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. అలాంటి చట్టాన్ని రద్దు చేసి తెచ్చిన వీబీ జీరామ్‌జీ చట్టానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అదే విధంగా గ్రామసభలు నిర్వహించి తీర్మానాలు చేయాలని డీసీసీలను ఆదేశించారు. మరోపక్క నరేగా గొప్పతనాన్ని వివరిస్తూ ప్రతి నియోజకవర్గానికి 5వేల చొప్పున కరపత్రాలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

**సామ్రాజ్యవాదంకంటే బీజేపీ ప్రమాదం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

సామ్రాజ్యవాదంకంటే బీజేపీ మరింత ప్రమాదమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. దేశంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ సంస్కరణలు, గొప్ప మార్పులు కాంగ్రెస్ తెచ్చిన చట్టాలతోనే వచ్చాయని ఆయన గుర్తుచేశారు. బీజేపీ ఆ చట్టాలను రద్దు చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీపై లాఠీ ఎత్తేందుకు కూడా సామ్రాజ్యవాదులైన బ్రిటీష్ పాలకులు ఇష్టపడలేదని, కానీ ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన వ్యక్తులు ఆయన్ను కాల్చి చంపేశారని గుర్తుచేశారు. ఆ భావజాలం కలిగిన పాలకులు ఈ దేశానికే ప్రమాదకరమని హెచ్చరించారు. కేంద్రం తెచ్చిన కొత్త చట్టంలో వ్యవసాయ సీజన్‌లో ఏడాదిలో 60 రోజుల పాటు ఉపాధి పనులకు అవకాశం లేదని, దీంతో పేదలు పట్టణాలకు వలసపోయే ప్రమాదముందని అన్నారు. యజమానులు ఎంత కూలీ ఇస్తే అంత తీసుకునే దుస్థితి తలెత్తుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

**దక్షిణాదికి అన్యాయం**

ఆయా రాష్ట్రాల నుంచి వచ్చే పన్నులను తిరిగి ఇచ్చే విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం అన్యాయం చేస్తోందని డిప్యూటీ సీఎం విమర్శించారు. ఉత్తరాది రాష్ట్రాలు రూ.100 పన్ను కడితే రూ.300 వాటికి కేటాయిస్తున్నదని చెప్పారు. తెలంగాణకు మాత్రం రూ.100 కడితే రూ.45 మాత్రమే కేటాయిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీజీ రామ్‌జీ చట్టం రద్దు కోసం చేసే ఉద్యమంలో రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలందరూ పాల్గొంటారని ఆయన వివరించారు.

**ఉపాధితో విప్లవాత్మక మార్పులు : మంత్రి ఉత్తమ్**

ఉపాధి చట్టం దేశంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. అలాంటి చట్టాన్ని బీజేపీ రద్దు చేసిందని విమర్శించారు. మోడీ తెచ్చిన కొత్త చట్టం గ్రామీణ కూలీలకు మరణ శాసనం లాంటిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నరేగా చట్టంలో మార్పులను సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్ష నటరాజన్, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, అజహరుద్దీన్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, ఏఐసీసీ నాయకులు ప్రవీణ్ చక్రవర్తి, ప్రభుత్వ సలహాదారులు కేశవ రావు, వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, హర్కర వేణుగోపాల్, పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ (పీఏసీ) సభ్యులు, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్లు, జనరల్ సెక్రెటరీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ తీరుతో రాయలసీమకు తీరని నష్టం

(మొదటిపేజీ తరువాయి)
ఏర్పడుతుందని చెప్పారు. తెలంగాణా ప్రభుత్వంతో ముఖ్యమంత్రి రహస్య ఒప్పందం చేసుకున్నారని, రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెడుతున్నారని అన్నారు. దీనివల్ల రాయలసీమ, నెల్లూరు జిల్లాలు ప్రజలు అవస్థలు పడతారని తెలిపారు. శ్రీశైలంలో 841 అడుగుల ఎత్తువద్ద పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ఉందని, 44 వేల క్యూసెక్కులు ఎత్తిపోయాలంటే 881 అడుగుల మట్టం నీరు ఉండాలని తెలిపారు. పోతిరెడ్డిపాడు నుండి 101 టిఎంసిల నీరు కేటాయింపు ఉందని, అయినా 20 ఏళ్లలో కేవలం మూడు, నాలుగుసార్లు మాత్రమే ఆ స్థాయిలో నీరు వచ్చిందని వివరించారు. కల్వకుర్తి లిఫ్టును 20 టిఎంసిల నుండి 50 టిఎంసిలకు పెంచి 777 అడుగుల ఎత్తులో ఉన్నా నీటిని తోడుతున్నారని, అప్పట్లో సిఎంగా ఉన్న చంద్రబాబు నోరెత్తలేదని విమర్శించారు. ఎస్ఎల్‌బిసి ద్వారా 40 టిఎంసిలు తోడుతున్నారని, పాలమూరు రంగారెడ్డి ద్వారా రెండు టిఎంసిలు తీసుకెళు తున్నా రాష్ట్రం మాట్లాడటం లేదని పేర్కొన్నారు. జూరాల, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, భీమ లిఫ్టుల ద్వారా నీటిని మళ్లిస్తున్నారని పేర్కొన్నారు. పవర్ హౌస్ ద్వారా రోజుకు ఎనిమిది టిఎంసి నీరు తోడేస్తున్నారని అయినా తెలంగాణాను అడ్డుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు అన్ని అనుమతులూ వైసిపి హయాంలోనే తెచ్చామని, విశాఖ, భోగాపురం లింకురోడ్డుకూ అనుమతులు తీసుకొచ్చామని చెప్పారు. టిడిపి హయాంలో భూసేకరణ పేరుతో వేల ఎకరాలు దోచుకునేందుకు ప్రయత్నిస్తే తాము 2700 ఎకరాల్లో అనుమతులు తీసుకొచ్చామని చెప్పారు. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి అంతా తామే చేశామని ఇప్పుడు చెబుతున్నారని, ఇది రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. 2026లో విమానాలు ల్యాండ్ అవుతాయని, తాము అప్పుడే చెప్పామని, అదే నిజమైందని తెలిపారు. విశాఖ, భోగాపురం రోడ్డు విష యంలో టిడిపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. పరిశ్రమల విషయం లోనూ చంద్రబాబు అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. వైసిపి హయాంలో పరిశ్రమలు తరలిపోయా యని చెబుతున్నారని, నిజానికి బాబు హయాంలోనే పరిశ్రమలు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయాయని చెప్పారు. ఎంఎస్ఎంఇ రంగం కూడా ప్రస్తుతం దెబ్బతిందని, వారికి ఇవ్వాల్సిన రాయితీలు రూ.2000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు.

**రాజధానిని గుంటూరు- విజయవాడ మధ్య పెట్టచ్చు**

అమరావతి రాజధానిని నిర్మించాలంటే కనీసం రూ.2 లక్షల కోట్లు ఖర్చవుతుందని, అలాంటప్పుడు గుంటూరు విజయవాడ మధ్యలో ఏర్పాటు చేస్తే ఆ డబ్బంతా మిగులుతుందని మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రసుత్తం 50 వేల ఎకరాలు ఉందని, మరో 50 వేల ఎకరాలు తీసుకునేందుకు పూలింగు చేపట్టారని అన్నారు. అన్ని సదుపాయాలు కలిపి ఎకరానికి రెండుకోట్లు ఖర్చువుతుందని అంటే రెండు లక్షల కోట్లు ఎక్కడ నుండి తెచ్చి ఖర్చు చేస్తారని అన్నారు.

# సంపాదకీయం

## భారత్ తప్పటడుగులు వేసిందా

నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత నెల రోజుల నుంచి షేక్ హసీనాకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో ప్రజలు వీధుల్లోకి వచ్చి పోరాటం మొదలుపెట్టారు. ఈ నిరసనలు ఆగస్టు 5న తీవ్ర హింసాత్మకంగా మారాయి. షేక్ హసీనా తన ప్రాణాలను కాపాడుకోవడానికి భారత్‌కు రావాల్సి వచ్చింది. బంగ్లాదేశ్‌లో నిరంకుశ పాలనను కొనసాగించారని ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడిగా పేరున్న హసీనా తండ్రి ముజిబుర్ రెహమాన్‌కు, భారత్‌తో చారిత్రాత్మక సంబంధాలు ఉన్నాయి. షేక్ హసీనా, భారత్ మధ్య సంబంధాలు కూడా అదే విధంగా కొనసాగాయి. అయితే, భారత్ మద్దతుతోనే షేక్ హసీనా అధికారంలో ఉన్నారని బంగ్లాదేశ్‌లోని ప్రతిపక్షాలు, షేక్ హసీనా వ్యతిరేకులు ఆరోపిస్తూ వచ్చారు. గతేడాది ఆగస్టులో షేక్ హసీనాకు భారత్ ఆశ్రయం ఇచ్చిన తర్వాత బంగ్లాదేశ్‌లో యాంటీ-ఇండియా సెంటిమెంట్ మరింత పెరిగింది. బంగ్లాదేశ్‌ను భారత్ ఎప్పుడూ షేక్ హసీనా కుటుంబ దృష్టితోనే చూస్తోందని, అంతకు మించి చూసేందుకు ఎప్పుడూ ప్రయత్నించలేదని బంగ్లాదేశ్ మీడియా అంటోంది. ఈ నెల డిసెంబర్ 23న బ్రస్సెల్స్‌కు చెందిన లాభాపేక్ష లేని పరిశోధనా సంస్థ ఇంటర్నేషనల్ క్రైసిస్ గ్రూప్ (ఐసీజీ) భారత్-బంగ్లాదేశ్ సంబంధాలపై 'ఆఫ్టర్ ది "గోల్డెన్ ఎరా": గెటింగ్ బంగ్లాదేశ్-ఇండియా టైస్ బ్యాక్ ఆన్ ట్రాక్ అనే పేరుతో 53 పేజీల రీసర్చ్ రిపోర్టును ప్రచురించింది. గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్ ప్రధానమంత్రిగా షేక్ హసీనా తన పదవిని కోల్పోవడం భారత్‌కు తీవ్ర ఎదురు దెబ్బ అని ఈ నివేదికలో పేర్కొంది. బంగ్లాదేశ్-భారత్ సంబంధాలపై ఐసీజీ తాజాగా విడుదల చేసిన నివేదికలో.. విలియం వ్యాన్ షెండెల్ పుస్తకం 'ఏ హిస్టరీ ఆఫ్ బంగ్లాదేశ్' లోని కోట్‌ను కూడా చేర్చింది. 'ఏ హిస్టరీ ఆఫ్ బంగ్లాదేశ్' పుస్తకంలో విలియం వ్యాన్ షెండెల్ రాసిన వివరాల్లో, " బంగ్లాదేశ్ స్వాతంత్ర్యానికి భారత్ మద్దతు ఇచ్చినప్పటికీ, రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు శత్రుత్వంలా కాకపోయినా, తరచూ ఉద్రిక్తంగానే ఉండేవి. బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించడంలో ఒకరి పాత్రను మరొకరు తక్కువ చేసుకునే కథనాలను రెండు దేశాలు ప్రోత్సహించేవి" అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో న్యూదిల్లీ సహకారానికి తగినంత కృతజ్ఞతను బంగ్లాదేశ్ చూపించలేదని భారత్‌లో ఒక దృక్పథం ఉంది. అలాగే, భారత్ కేవలం తన సొంత వ్యూహాత్మక ప్రయోజనాలకు మాత్రమే జోక్యం చేసుకుంటుందని.. స్వతంత్ర బంగ్లాదేశ్‌ను ఒక శాటిలైట్ స్టేట్‌గా (మరోదేశం నియంత్రణలో,అత్యధిక రాజకీయ ప్రాబల్యంతో నడిచే దేశంగా) భావించి, ఏహ్య భావంతో చూస్తుందని ఆ దేశ ప్రజలు విస్తృతంగా భావిస్తున్నారు" అని రాశారు. భారత విదేశాంగ వ్యవహారాల జర్నల్‌లో స్మృతి ఎస్. పట్నాయక్ రాసిన ఆర్టికల్‌ను కూడా ఈ నివేదిక కోట్ చేసింది. "షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్‌కు భారత్ ఇచ్చిన స్థిరమైన మద్దతు ద్వారానే ఎన్నో సంవత్సరాలుగా భారత్, బంగ్లాదేశ్ సంబంధాల మధ్య పునాది బలపడిందని పునరుద్ఘాటించడం చాలా ముఖ్యం. ఎందుకంటే, ప్రస్తుతం ఈ పార్టీ అధికారాన్ని కోల్పోయింది. రెండు దేశాల మధ్య పునాది కూడా తీవ్రంగా దెబ్బతిన్నది" అని డైలీ స్టార్ రాసింది. ఈ దెబ్బతిన్న ప్రాంతంలో ఉన్న ఖాళీని పరస్పర అనుమానం పూరిస్తోంది. బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా పన్నాగాలు పన్నుతూ, పారిపోయిన వారికి న్యూదిల్లీ సురక్షితమైన ప్రదేశంగా మారిందని ఢాకా భావిస్తోంది. అలాగే, బంగ్లాదేశ్‌లో మెజారిటీ వర్గాల అరాచకం పెరుగుతోందని భారత్ ఆందోళన చెందుతోంది. జియా-ఉర్-రెహమాన్, ఖలీదా జియాలు భారత్ ప్రయోజనాలు దెబ్బతీస్తుండటంతో, భారత్ తప్పనిసరి పరిస్థితుల్లో షేక్ హసీనాకు మద్దతు ఇవ్వాల్సి వచ్చిందని దిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలోని సౌత్ ఏషియన్ స్టడీస్ సెంటర్ ప్రొఫెసర్ మహేంద్ర పీ లామా భావిస్తున్నారు. "తూర్పు పాకిస్తాన్ కారణంగా భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలతో దాదాపు సంబంధాలు తెగిపోయాయి. అప్పుడు, బంగ్లాదేశ్ ఏర్పాటు ఒక ఆశను తీసుకొచ్చింది. షేక్ ముజిబుర్ రెహమాన్, షేక్ హసీనా పదవీ కాలాల్లో ఈ ఆశ సజీవంగా మిగిలింది. అయితే, బంగ్లాదేశ్‌లోని జియా-ఉర్-రెహమాన్, హుస్సేన్ మొహమ్మద్ ఇర్షాద్‌లు భారత ప్రయోజనాలను దెబ్బతీశారు. అలాంటి పరిస్థితుల్లో షేక్ హసీనా, అవామీ లీగ్‌ను భారత్ బలపర్చాల్సి వచ్చింది" అని ప్రొఫెసర్ లామా చెప్పారు. 1975 ఆగస్టులో బంగ్లాదేశ్ తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్యోద్యమ నాయకుడు షేక్ ముజిబుర్ రెహమాన్‌తో పాటు చాలామంది తన కుటుంబ సభ్యులు సైనిక తిరుగుబాటులో హత్యకు గురయ్యారు. ఈ ఘటన రెండు దేశాలకు టర్నింగ్ పాయింట్ అయింది. ఈ హత్యలు బంగ్లాదేశ్‌లో సైనిక పాలనకు దారితీశాయి. ముఖ్యంగా, 1976 నుంచి 1981 వరకు జియా-ఉర్-రెహమాన్ పాలనలో (ఆ తర్వాత సైన్యంలోని సభ్యులే జియా-ఉర్-రెహమాన్‌ను హత్య చేశారు), ఆ తర్వాత 1982 నుంచి 1990 మధ్య కాలంలో హుస్సేన్ మొహమ్మద్ ఇర్షాద్ పాలనలో బంగ్లాదేశ్ నడిచింది" అని ఐసీజీ తన నివేదికలో పేర్కొంది. ఢాకాలో 15 ఏళ్ల సైనిక పాలన కాలంలో.. భారత్-బంగ్లాదేశ్‌లు ఒకదానికొకటి ప్రధానంగా భద్రతా కోణంలోనే చూసుకునేవి. ఇరు దేశాలు తమ భూభాగాల్లో పనిచేసే తిరుగుబాటు గ్రూప్‌లకు మద్దతు ఇచ్చాయి. బంగ్లాదేశ్ చిట్టగాంగ్ కొండ ప్రాంతాల్లో (చిట్టగాంగ్ హిల్ ట్రాక్ట్స్) శాంతి బాహిని సంస్థకు న్యూదిల్లీ మద్దతు ఇచ్చేది" అని ఐసీజీ రాసింది. ఈశాన్య భారత్‌లో ఆపరేట్ అయ్యే తిరుగుబాటుదారులకు ఆయుధాలను సరఫరా చేస్తూ ఢాకా సాయం చేసింది. బంగ్లాదేశీ గడ్డపై క్యాంపులు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి కూడా ఇచ్చింది. 1980లలో, బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలు భారత్‌లో రాజకీయ సమస్యగా మారాయి. దీనికి స్పందనగా, సరిహద్దుల్లో న్యూదిల్లీ కంచెలు వేసింది. సరిహద్దు భద్రతను కట్టుదిట్టం చేసింది" అని పేర్కొంది. 1990-91లో బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పాలన తిరిగి రావడంతో ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడొచ్చన్న ఆశలు భారత్‌లో కలిగాయి. కానీ, బంగ్లాదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం బీఎన్‌పీ నేతృత్వంలో ఏర్పడింది. ప్రధానమంత్రి ఖలీదా జియా 1992లో భారత్‌ను సందర్శించడం, రెండు దేశాల మధ్య సరికొత్త వాణిజ్య ఒప్పందంవంటి సానుకూల సంకేతాలు ప్రారంభంలో ఉన్నప్పటికీ, ఆ తర్వాత సంబంధాల మెరుగుదల ఆశలు నీరుగారిపోయాయి. తిరుగుబాటుదారులకు బంగ్లాదేశ్ మద్దతు ఇస్తోందని భారత అధికారులు ఆరోపించారు. నీళ్ల పంపిణీ, సరిహద్దు విభజన వంటి కీలక ద్వైపాక్షిక విషయాల్లో కొంత పురోగతి కనిపించింది. బీఎన్‌పీ ప్రభుత్వానికి జమాత్ ఏ ఇస్లామీ మద్దతు ఇస్తోందని భారత్ ఆరోపించిన తర్వాత ఈ అపనమ్మకం మరింత పెరిగింది. హిందూ జాతీయవాద భారతీయ జనతా పార్టీ ప్రభావం పెరగడం, 1992 డిసెంబర్‌లో బాబ్రీ మసీదు కూల్చడం వంటివి బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక భావనను మరింత పెంచాయి. బాబ్రీ మసీదు కూల్చిన తర్వాత, బంగ్లాదేశ్‌లో హిందూ కమ్యూనిటీకి చెందిన వారిపై దాడులు జరిగాయి. భారత్‌లో హిందూ-ముస్లింల మధ్య మత ఘర్షణలు జరిగాయి. భారత దేశీయ రాజకీయాల్లో ముస్లింల పట్ల ద్వేష రాజకీయాలు ఉంటే అది బంగ్లాదేశ్‌ను కూడా ప్రభావితం చేస్తుందని, అక్కడ ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని ఆశించలేమని ప్రొఫెసర్ లామా అన్నారు. 16 నెలలుగా భారత్-బంగ్లాదేశ్‌ల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు స్తంభించిపోయాయి. గత 10 రోజులుగా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. భద్రతా కారణాలతో, భారత్‌లో దిల్లీ సహా నాలుగు ప్రాంతాల్లో వీసా సర్వీసులను ఢాకా నిలిపివేసింది. అలాగే, భారత్ కూడా ఢాకాతో సహా నాలుగు ప్రాంతాల్లో వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఢాకా, దిల్లీ మధ్యలో ఇంత అపనమ్మకం, అనుమానాన్ని నేనెప్పుడూ చూడలేదు. అంతర్జాతీయ నిబంధనలు ప్రకారం, ఇరుదేశాలు దౌత్య కార్యాలయాలకు భద్రత కల్పించాలి. రెండు పొరుగుదేశాలు, ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉన్నందున భారత్ వాస్తవాన్ని అంగీకరించి, బంగ్లాదేశ్‌తో ఉన్న సంబంధాల విషయంలో నమ్మకాన్ని పునరుద్ధరించే కార్యక్రమాన్ని చేపట్టాల్సిన అవసరం ఉంది.

# మున్సిపల్ ఎన్నికలకు ఇంకా ఆలస్యం...

**విజయవాడ - సూర్య వాస్తవం**




తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలు ముగిశాయి. మున్సిపల్ ఎన్నికలకు అంతా రెడీ అవుతోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు కసరత్తు జరుగుతోంది. ఇదే టైమ్‌లో ఏపీలో కూడా లోకల్ బాడీ, మున్సిపల్ ఎలక్షన్స్‌కు వేగంగా అడుగులు పడ్డాయి. ఈ జనవరిలోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లేందుకు స్టేట్ ఈజీ సిద్ధమైంది. వార్డుల విభజన, ఓటర్ల జాబితా తయారీ స్పీడప్ చేసింది. కూటమి పార్టీలు కూడా ఎన్నికల వ్యూహాల్లో బిజీగా అయిపోయాయి. కట్ చేస్తే ఏపీలో లోకల్ బాడీ ఎన్నికలు, మున్సిపల్ పోల్స్ ఇప్పట్లో జరిగే పరిస్థితి లేదన్న టాక్ బయలుదేరింది. ఏపీలో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఏప్రిల్‌లో ముగుస్తుంది. మార్చిలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం ముగియనుంది. కానీ అంతలోపే జనగణన స్టార్ట్ అవుతుంది. దీంతో పంచాయితీల విలీనం, విభజన.. సేమ్‌టైమ్ మున్సిపాలిటీల విలీనం, విభజనకు అవకాశం లేకుండా పోతోంది. దీంతో ఏపీలో మున్సిపల్ ఎన్నికలు ఆలస్యం అవుతాయని అంటున్నారు. లేటెస్ట్ డెవలప్‌మెంట్ ప్రకారం జనగణన తర్వాతే ఏపీలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందట.

మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కూడా మున్సిపల్ ఎన్నికలపై స్పష్టత ఇచ్చేశారు. ఈ ఏడాది కేంద్రం జనగణన నిర్వహిస్తోంది. ఈ ప్రాసెస్ అంతా పూర్తి కావడానికి కనీసం ఆరు ఏడు నెలలు పడుతుందట. జనగణన మొత్తం పూర్తి అయి.. ఓ క్లారిటీ రావాలంటే ఏడాది సమయం పక్కా పడుతుందని.. 2026 డిసెంబర్ వరకు జనగణన మొత్తం పూర్తవుతుందని భావిస్తున్నారట. దాంతో జనగణన కంప్లీట్ అయ్యాకే ఆ వివరాలు అన్నీ చూసుకుని కొత్త డేటా ప్రకారం ఎన్నికలు పెట్టాలనేది కూటమి ప్రభుత్వం ఆలోచనగా చెబుతున్నారు. 2027 స్టార్టింగ్‌లో లోకల్ బాడీస్, ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనలో ఉందట ఏపీ సర్కార్. ప్రస్తుతం ప్రభుత్వం దగ్గర 2011 జనాభా లెక్కల వివరాలే ఉన్నాయి. ఆ తర్వాత అయితే 2021లో కరోనా కారణంగా జనగణన జరగలేదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం జనగణనను చేయాలని డిసైడ్ అయింది. దీంతో ఏపీలో ఎన్నికలు వాయిదా పడతాయని అంటున్నారు. కొత్త లెక్కలతో సామాజిక సమీకరణలు కూడా చూసుకుని పూర్తి సమాచారంతో అన్ని వర్గాలకు న్యాయం చేసేలా రిజర్వేషన్ కూర్పు చేస్తారని చర్చ జరుగుతోంది. ఇక మార్చితో మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల పాలక వర్గం గడువు ముగుస్తుంది. దాంతో పాలక మండళ్లు రద్దు అవుతాయి. అయితే తొమ్మిది నెలల నుంచి ఏడాది దాకా ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలోనే లోకల్ బాడీస్ పాలన సాగుతుందని అంటున్నారు. ఇక విజయవాడని గ్రేటర్‌గా మార్చాలనే ప్రతిపాదన ఉందట. తిరుపతి కార్పొరేషన్‌ను కూడా గ్రేటర్‌గా చేసే ఆలోచన ఉందంటున్నారు. ఈ డిమాండ్లపై కూడా జనగణన లెక్కలు వచ్చాక.. 2027లోనే ఓ అంచనాకు వస్తారని అంటున్నారు. ఫైనల్‌గా ఈ ఏడాదిలో మున్సిపల్ ఎన్నికలు అయితే ఉండవంటున్నారు. దాంతో ఇటు కూటమి పార్టీలకు..ఇటు వైసీపీకి స్థానిక వ్యూహాలు రచించేందుకు ఇంకో ఏడాది టైమ్ దొరికినట్లు అయింది.

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జనగణన తరువాత ఉంటుందని సంకేతాలు ఇచ్చారు. దీంతో ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు ఈ ఏడాది జరిగే అవకాశం లేదని ప్రచారం మొదలైంది. 2027 ప్రథమార్ధంలో జరుగుతాయని టాక్ నడుస్తోంది. కొద్దిరోజుల కిందట రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నీలం సాహ్ని స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి సన్నాహాలు ప్రారంభించారు. కానీ ఇప్పుడు జనగణన తెరపైకి రావడంతో.. అది పూర్తయిన తర్వాతే ఎన్నికలు అని స్పష్టమవుతోంది.

- 2021లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ముందుగా పంచాయితీ ఎన్నికలు జరగగా.. తరువాత మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. చివరిగా మండల, జిల్లా ప్రాదేశికాలకు సంబంధించి ఎన్నికలు నిర్వహించారు.
- పంచాయితీ ఎన్నికలకు సంబంధించి ఫిబ్రవరితో గడువు ముగియనుంది. అయితే ముందుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించి.. తరువాత మిగతా ఎన్నికలు పూర్తి చేయాలని భావిస్తోంది ప్రభుత్వం.
- మార్చి వరకు మున్సిపాలిటీలతోపాటు కార్పొరేషన్లకు గడువు ఉంది. జిల్లా పరిషత్తులకు అయితే జూన్ వరకు గడువు ఉంది.- ఏప్రిల్ నుంచి జనగణన ప్రారంభం కానుంది. అది కొలిక్కి రావాలంటే ఈ ఏడాది డిసెంబర్ పడుతుంది. అందుకే కొత్త జనాభా లెక్కల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలి అనుకుంటే 2027 వరకు ఆగాల్సిందే.
- ప్రస్తుత జనాభా లెక్కలు 2011 వరకు మాత్రమే ఉన్నాయి.. ప్రతి పది సంవత్సరాలకు జరగాల్సిన జనగణన 2021లో కరోనా కారణంగా జరగలేదు. అందుకే ఇప్పుడు జనగణన పూర్తి చేసే పనిలో ఉంది కేంద్ర ప్రభుత్వం. ఒకవేళ పాత జనాభా లెక్కల ప్రకారం ఎన్నికలకు నిర్వహించాలి అంటే ముందుగా పంచాయతీలను పూర్తి చేస్తారు.
- అయితే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే కేంద్ర ఆర్థిక సంఘం నిధులతో పాటు ప్రత్యేక నిధులు వర్తించవు. అదే జరిగితే గ్రామాల్లో మౌలిక వసతులు నిలిచిపోతాయి. అది ప్రభుత్వానికి ఇబ్బంది కరం. అందుకే ఎంత మాత్రం ఎన్నికలు నిర్వహించేందుకే ప్రభుత్వం మొగ్గు చూపుతోందని తెలుస్తోంది.

# గ్రౌండ్ లెవెల్‌లో ఏం జరుగుతుందో...?

**విజయవాడ - సూర్య వాస్తవం**

కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత గ్రౌండ్ లెవెల్ రియాలిటీని చంద్రబాబుకు చేరకుండా కొందరు అడ్డుపడుతున్నారన్న విమర్శలున్నాయి. తెలుగుదేశం పార్టీలో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందన్నది పార్టీ నాయకత్వానికి తెలియడం లేదా అంటే లేదనే సీనియర్ నేతలు అంటున్నారు. క్షేత్ర స్థాయిలో బూత్ స్థాయిలో నియమించి నెలవారీ జీతాలు చెల్లించి పెట్టుకున్న వారు సయితం పెద్దగా యాక్టివ్ గా లేరని సాక్షాత్తూ గోరంట్ల బుచ్చయ్య చౌదరి చెప్పడం పార్టీలో చర్చనీయాంశమైంది. చంద్రబాబు నాయుడు, లోకేశ్ లు కేవలం కేంద్ర రాష్ట్ర పార్టీ కార్యాలయంలోని మూడో అంతస్తు నుంచి వచ్చే నివేదికలను చూసి సంబపర పడుతున్నారని, కానీ గ్రౌండ్ లెవెల్లో జరుగుతున్న విషయాన్ని తెలుసుకోలేకపోతున్నారని కొందరు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే సోషల్ మీడియా వేదికగా బయట పెడుతున్నారు. దీంతో పాటు అధికారులు తీసుకుంటున్నారో.. లేక మంత్రుల నిర్ణయమో తెలియదు కానీ.. వైసీపీ నేతలకు, కాంట్రాక్టర్లకు పనులు బాగా ఈ కూటమి ప్రభుత్వంలో అవుతున్నాయన్న ఆవేదన కూడా కార్యకర్తల్లోనూ, నేతల్లోనూ ఉంది. ఆ విషయం కూడా తెలుగుదేశం పార్టీ అనుకూల మీడియాలో పుంఖాను పుంఖాలుగా కథనాలు వస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో పనిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ ఇప్పుడు టీడీపీ హయాంలో చేసిన పనులకు కాంట్రాక్టర్లకు చెల్లించకపోవడాన్ని వారు అభ్యంతరం చెబుతున్నారు. అసలు ప్రభుత్వంలో ఏం జరుగుతుందన్నది



చంద్రబాబుకు తెలిసి జరుగుతుందా? లేక తెలియక జరుగుతుందా? అని నెట్టింట్లో కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. ఇక తాజాగా తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలకు తిరుమలకు వచ్చినప్పుడు వైసీపీ నేతలకు టీటీడీ అధికారులు ప్రత్యేక దర్శనాలు చేయించడం కూడా సోషల్ మీడియా వేదికగా కార్యకర్తలు ఫైర్ అవుతు న్నారు. అసలు ప్రభుత్వంలో ఏం జరుగుతుంది? రాష్ట్రంలో జరుగుతున్న వాస్తవాలు చంద్రబాబు, లోకేశ్ కు చేరకుండా ఎవరైనా అడ్డుపడుతున్నారా? అన్న అనుమానాలను కూడా వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు, లోకేశ్ లు క్యాడర్ కోసం, పార్టీ కోసం కష్టపడిన వారి కోసం నిచేస్తామంటుంటే అందుకు విరుద్ధంగా పనులు జరుగుతుండటం పట్ల కార్యకర్తలు, నేతల్లో అసంతృప్తి వ్యక్మవుతుంది. ఇప్పటికైనా చంద్రబాబు పాలనలో ఏం జరుగుతుందో సరి చూసుకోవాలంటూ కార్యకర్తలు కోరుతున్నారు.

# గంజాయి కట్టడికి ప్రత్యేక చర్యలు

## గంజాయి కట్టడికి కేఫ్‌లలో స్నిఫర్ డాగ్‌తో పోలీసుల తనిఖీలు

**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు, అనంతపురం త్రీటౌన్ సి.ఐ రాజేంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో గంజాయి కట్టడికి ప్రత్యేక చర్యలు చేపట్టారు.



ఈ సందర్భంగా అనంతపురం త్రీటౌన్ పరిధిలోని కేఫ్‌లు, అలాగే స్థానిక రెండవ రోడ్డు, మూడవ రోడ్డు మరియు శాంతినగర్ ప్రాంతాల్లో స్నిఫర్ డాగ్ సహకారంతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల అక్రమ వినియోగం, రవాణాను అరికట్టడమే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రజల భద్రత, గంజాయి కట్టడి దృష్ట్యా ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, కేఫ్ నిర్వా హకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.



# రైతులు నష్టపోకుండా ఇన్సూరెన్స్ గడువు పొడిగించాలి

**- రాష్ట్రమంతటా వెబ్సైట్ ప్రారంభించాలి**

**- ఏవో ఓబులేసుకి వినితి**



**వేముల సూర్య వాస్తవం :** రైతులు పడుతున్న కష్టాలను, ఇబ్బందులను చూసి, ఇన్సూరెన్స్ కట్టడానికి మరింత గడువు కావాలని, ఉల్లి రైతులకు తక్షణమే నష్టపరిహారం అందాలని రాష్ట్రమంతటా వెబ్సైట్ ప్రారంభం కావాలని రైతు సంఘం నాయకులు, వేముల మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి రైతులతో కలిసి వేముల మండల ఏవో ఓబులేసుకి వినితిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద బుడ్డశనగ పంట బీమా కోసం దరఖాస్తు చేసుకోమని ప్రకటించినప్పటికీ ఇంతవరకు ఆ పోర్టల్ సంబంధించిన వెబ్సైట్ ధ్రువీకరించలేకపోవడం, ప్రభుత్వం ఇచ్చిన గడువు తీరిపోవడం రాష్ట్రమంతటా పలుచోట్ల ఫసల్ బీమా యోజన కింద ఇన్సూరెన్స్ కట్టలేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉల్లి రైతులకు ఎకరాకు 20,000 నష్టపరిహారం ప్రకటించినప్పటికీ చాలామంది రైతులకి పడలేదని పడలేదని రైతులు పడుతున్న కష్టాలను, ఇబ్బందులను చూసి, ఇన్సూరెన్స్ కట్టడానికి మరింత గడువు కావాలని మండల ఏవో ఓబులేసుకి వినితిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చల్లా వెంకట నారాయణ, పోరెడ్డి రాఘవరెడ్డి, మాజీ ఎంపీటీసీరాధాకృష్ణ, చలపతి, డిసిసి ఆంజనేయులు, రామ చంద్రారెడ్డి, వెంకట్రామిరెడ్డి, సూర్యుడు, సర్పంచ్ అర్జున్, నారు బోయిన గంగయ్య సోహెల్, గంగిరెడ్డి, జెర్మియా మండల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక జిల్లాకు కొనసాగుతున్న నిరాహార దీక్షలు



**రాయచోటి- సూర్య వాస్తవం :** జాతీయ కాంగ్రెస్, యూనియన్ ముస్లిం లీగ్, ప్రజా సంఘాల సామూహిక నిరాహార దీక్షలు గురువారం రెండవ రోజు చేరుకున్నాయి. దీక్ష శిబిరానికి విచ్చేసిన స్థానిక షాహి జామియా మసీద్ కమిటీ మాజీ సెక్రటరీ అజిజుర్ రెహమాన్, నియోజకవర్గం ఎస్సీ సెల్ ఛైర్మన్‌లు ఈ దీక్షలో కూర్చున్న షపాబుల్, మన్సూర్, నరేష్, చిన్న, ఎం .ఖాదర్ బాషా, బాబా సర్దార్, ఖాదర్ ఖాన్, అమీర్ లకు తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3.50 జనాభా, 928 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, 12 మండలాలు గల పోలవరం జిల్లాకేంద్రంగారొంపచోడవరాన్ని గుర్తించింది కూటమి ప్రభుత్వమని అన్నారు. అదేవిధంగా 8 లక్షలకు పైగా జనాభా 3,950 కిలో మీటర్లకు పైగా విస్తీర్ణం కలిగిఉన్న లక్కిరెడ్డిపల్లి, రామాపురం, చక్రాయపేట, వీరబల్లి, సుండుపల్లి, కె.వి పల్లి, సంబేపల్లి, కలకడ, చిన్నమండెం, గుర్రంకొండ, గాలివీడు, పెద్దమండెం, నంబరు పూలకుంటతో రాయ చోటి కలుపుకుని 8 లక్షలకు పైగా జనాభా, 3,950 కిలోమీటర్లకు పైగా విస్తీర్ణం కలిగిన మా 14 మండలాల ప్రాంతాన్ని రాయచోటిని ప్రత్యేక జిల్లాగా ఎందుకు చేయకూడదు, ఎందుకు ప్రకటించకూడదని వారు ఈ సందర్భంగా ప్రభుత్వానికి ప్రశ్నించారు. రాయచోటిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఇవాళ డిమాండ్ చేశారు.

# అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు

**- వ్యవసాయ శాఖ ఏడీ రామ్మోహన్ రెడ్డి**



**తొండూరు - సూర్య వాస్తవం:** ఎమ్మార్పీ ధరల కంటే ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముద్దనూరు వ్యవసాయ శాఖ ఏడీ రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన తొండూరులోని ఎరువుల దుకాణాలను ఆయన ఏవో రాజుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎరువుల దుకాణాలలో ఉన్న స్టాక్ రిజిస్టర్లను, ఎరువుల స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువులను విక్రయించిన రైతులకు తప్పని సరిగా డిజిటల్ బిల్లులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం ప్రాజెక్టు కాంగ్రెస్ పార్టీ మానస పుత్రిక

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఎప్పుడో పూర్తయి ఉండేది
- 135 అడుగుల ఎత్తులో నిర్మిస్తే ప్రయోజనం లేదు
- 150 అడుగుల ఎత్తులో నిర్మిస్తేనే ఉపయోగం
- పోలవరం ప్రాజెక్టు అథరిటీ కార్యాలయాన్ని హైదరాబాద్ నుండి రాజమండ్రికి తరలించాలి
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె -సూర్య వాస్తవం:** పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అని,ప్రకృతి ప్రసాదించిన వరమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. గురువారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కాంగ్రెస్ పార్టీ మానస పుత్రిక అన్నారు. 1980 సంవత్సరం లోనే ఆనాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య 150 అడుగుల ఎత్తులో నిర్మించే విధంగా ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2004వ సంవత్సరం జూలై మాసంలో ఆనాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టు మీద రాజశేఖర్ రెడ్డి పాలనలో 2300 కోట్ల రూపాయలు, తర్వాత వచ్చిన కాంగ్రెస్ ముఖ్యమంత్రులు రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి పాలనలో 2836 కోట్ల రూపాయలు ఈ ప్రాజెక్టు మీద ఖర్చు చేశారు. మొత్తం మీద కాంగ్రెస్ పాలనలో ఈ ప్రాజెక్టు మీద రూ.5136 కోట్లు ఖర్చు పెట్టారు. కాంగ్రెస్ పాలనలోనే మొత్తం ప్రాజెక్టులో 32 శాతం పూర్తి అయింది. 90 శాతం అనుమతులు వచ్చాయి. కుడి కాలువ పనులు 80శాతం, ఎడమ కాలువ పనులు 45 శాతం పూర్తయ్యాయి. జలయజ్ఞం కింద చేర్చారు. రాష్ట్ర విభజన సందర్భంగా రాష్ట్ర విభజన చట్టంలో సెక్షన్ 90 ద్వారా పోలవరం ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించారు. బచావత ట్రిబ్యునల్, కేంద్ర జల సంఘం పోలవరం ప్రాజెక్టును 150 అడుగుల ఎత్తు వరకు నిర్మించేటందుకు అనుమతి ఇచ్చాయి. ఆ స్థాయిలో నిర్మిస్తే బహుళ ప్రయోజనాలు ఉంటాయి. 7,20,000 ఎకరాల కొత్త ఆయకట్టు, పది లక్షల 13 వేల ఎకరాల స్థి?రీ కరణ ఉంటుంది. 540 గ్రామాలలో 28 లక్షల 50 వేల మందికి త్రాగునీరు అందుతుంది. విశాఖ పట్నం నగరానికి త్రాగునీరు, విశాఖ ఉక్కు కర్మాగారానికి పారిశ్రామిక నీరు లభిస్తుంది.960 మెగా వాట్ల జల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. గోదావరి - కృష్ణా నదుల అనుసంధానం జరుగుతుంది. 80 టీఎంసీల గోదావరి జిల్లాలను కృష్ణా డెల్టాకు మళ్లించవచ్చు.జల రవాణా ఉంటుంది. అందువల్లనే ఇది బహుళార్థసాధక ప్రాజెక్టు అయింది.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే ఈ ప్రాజెక్టు 2016 నాటికి అన్ని విధాలా పూర్తి అయి ఉండేది. దురదృష్టవశాత్తు కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలైన టిడిపి వైకాపా అధికారంలోకి రావడంతో ఈ ప్రాజెక్టు నత్తనడకన సాగుతోంది. మోడీ ప్రభుత్వం మోసగారితనం, టిడిపి, వైకాపా ప్రభుత్వాల చేతగానితనం ఇందుకు కారణం.

బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టును క్షత్రస్థాయిలో పరిశీలించి 135 అడుగుల ఎత్తులో మొదటి ఫేస్ నిర్మాణం 2017 మార్చి 31 నాటికి పూర్తి చేస్తామని ప్రకటించడం జరిగింది . కేంద్ర జల సంఘం, బచావత్ ట్రిబ్యునల్ 150 అడుగుల ఎత్తులో నిర్మించేందుకు అనుమతి ఇవ్వగా చంద్రబాబు 135 అడుగుల ఎత్తుకే నిర్మించి జాతికి అంకితం చేస్తామని చెప్పడం విడ్డూరం.దీనివలన నిర్దేశించిన లక్ష్యలు నెరవేరవు. కుడి,ఎడమ కాలువల లోకి గ్రావిటీ ద్వారా నీరు ప్రవహించదు. 150 అడుగుల ఎత్తుకు నిర్మిస్తేనే ఈ ప్రాజెక్టు వల్ల ఉపయోగం ఉంటుంది.అంతే తప్ప 135 అడుగులకే పరిమితం చేస్తే ఈ ప్రాజెక్టు కట్టినా ఒకటే కట్టకున్నా ఒకటే. కాబట్టి పోలవరం ప్రాజెక్టును 150 అడుగుల ఎత్తులో నిర్మించి జాతికి అంకితం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేస్తుంది.

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం పోలవరం ప్రాజెక్టు అథరిటీని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ అథరిటీ కార్యాలయం తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదులో ఉండడం విడ్డూరం. పోలవరం ప్రాజెక్టు అథరిటీ కార్యాలయాన్ని ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే రాజమండ్రికి తరలించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# సాయిబాబా ఆలయంలో ధనుర్మాస పూజలు

**పులివెందుల- సూర్య వాస్తవం :** పులివెందులలో పార్నపల్లి రోడ్డు సమీపంలో మొట్టమొదటిగా కొలువైన శ్రీ శిరిడి సాయి బాబా ఆలయంలో ధనుర్మాసని పురస్కరించుకొని గురు వారం షిరిడి సాయిబాబా ఆలయంలో విశేష పూజలు నిర్వ హించారు. ఉదయాస్తమాన స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో సాయి నాధునికి ఉదయం కాగడ హారతి, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి, తదితర పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారు ప్రత్యేక అలం కారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం 12 గంట లకు మధ్యాహ్నం హారతి సాయంకాలం 6 గంటలకు సంధ్య హారతి రాత్రి 9 గంటలకు శేజ హారతులు స్వామివారికి అర్పించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గురువారం ఆలయంలో భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాలు విశేషంగా నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ధనుర్మాసంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతోందని తెలియజేశారు.

**ఆలయ అభివృద్ధికి సహకరించండి**

ఆలయ ప్రాంగణంలో ఆలయ అభివృద్ధిలో భాగంగా కళ్యాణ మండపం గదులు వంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుంది ఎవరైనా దాతలు ముందుకు వచ్చి షిరిడి సాయి బాబా ఆలయ అభివృద్ధికి



సహకరించాలని ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య పిలుపునిచ్చారు. సహాయ సహకారాలు అందించిన దాతల పేర్లు ఆలయంలో శిలా పథకం వేయించి శాశ్వతంగా ఉండే విధంగా చర్యలు చేపడతారని, ప్రతి సంవత్సరం గురు పౌర్ణమి లో దాతలకు విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి సేవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రతా మాసోత్సవాలు



**కదిరి- సూర్య వాస్తవం :** రహదారి భద్రత మాసోత్సవాలు - 2026 భాగంగా కదిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లోరహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ మాసోత్సవాలు లో భాగంగా కదిరి రవాణా శాఖ అధికారులు ఆర్‌టీవో జే.శ్రీనివాసులు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ డిఎస్ఎమ్ వరప్రసాద్ బాబు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం ఆర్టివో శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు కు వాహనాలు నడు పుతూ ఉన్నప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి సూచనలు తెలియజేశారు, డిఎస్ఎమ్ వరప్రసాద్ మాట్లాడుతూ రోడ్డుపైన వాహనాలు నడుపుతూ ఉన్నప్పుడు ట్రాఫిక్ సిగ్నల్ గురించి, హెల్మెట్ లేకుండా టూ వీలర్ వాహనం నడపరాదంటూ, సెల్ ఫోన్లు మాట్లాడుతూ వాహనం నడపరాదని రోడ్డుపైన వెళ్ళినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియ జేశారు. ఈ మాసోత్సవాలు భాగంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ కే.రమా, విభా గాధిపతులు పి.భాస్కర్ మహబూబ్ బాషా, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రతా ప్రమాణాలు పాటించండి

**- మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్**



**పులివెందుల -సూర్య వాస్తవం:** వాహనదారులు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని పులివెందుల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం పులివెందులలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులకు రహదారి భద్రత గురించి అవగాహన కల్పిస్తూ భద్రతా ప్రమాణాలలో భాగంగా మద్యం సేవించి వాహనాలను నడపరాదని, వాహనదారులు సీట్ బెల్టు, హెల్మెట్ తప్పక ధరించాలని, మితిమీరిన వేగాన్ని నియం త్రించుకోవాలని అదేవిధంగా సాంకేతిక లోపాలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు వాహనాలను పరీక్షించు కోవాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వాహనాలను డ్రైవ్ చేయాలని, పై నిబంధనలను పాటించడం ద్వారానే ప్రయాణాలను మరింత సుఖమయం, సౌకర్యవంతం చేసుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ డిఎం ప్రేమ్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నవోదయలో ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష

**మదనపల్లె - సూర్య వాస్తవం:** జవహర్ నవోదయ పాఠశాలలో 9వ తరగతి, 11వ తరగతిలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 7వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గీత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11వ తరగతిలో చేరే అభ్యర్థులకు మదనపల్లి పట్టణంలోని జడ్పీ హైస్కూల్లో రెండు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు ఉదయం 10 గంటలకే నిర్ణీత కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. అదేవిధంగా 9వ తరగతి లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రవేశ పరీక్ష జవహర్ నవోదయ లో ఒక సెంటర్, మదనపల్లి హెూప్ మున్సిపల్ హైస్కూల్లో ఒక సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులకు ఉదయం 11:15 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1:45 వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని, ఉదయం10 గంటలకే



సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు. నెట్ సెంటర్‌లో హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు.



## పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

**లక్కిరెడ్డిపల్లి సూర్య వాస్తవం :** రైతు సంక్షమమే ప్రభుత్వ ధ్యేయమని రైతులకు భూ హక్కుల విషయంలో ఎదురవుతున్న సమస్యలను తొలగిస్తూ ప్రభుత్వం కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తుందని తహశీల్దార్ క్రాంతి కుమర్, సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మద్దిరేవుల గ్రామ సచివాలయం నందు మండల తహసిల్దార్ క్రాంతి కుమర్ కలిసి సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.రీ - సర్వే పేరుతో జరిగిన గందరగోళానికి స్వస్తి పలుకుతూ,రైతులకు భరోసా నిచ్చేలా ప్రస్తుతం పంపిణీ చేస్తున్న నూతన పాస్ పుస్తకాలను అధునాతన సాంకేతికతతో రూపొందించిందన్నారు. ఇందులో భూమి విస్తీర్ణంతోపాటు, భూమికి సంబంధించిన మ్యాప్,భద్రత కోసం క్యూ-ఆర్ కోడ్ వంటి ప్రత్యేకతలు ఉన్నాయని వారు తెలియజేశారు. గ్రామంలో 1086 ప్రభుత్వ రాజముద్రతో కూడిన పుస్తకాలు ప్రభుత్వం ముద్రించినదని అన్నారు. రైతులకు ఇప్పటివరకు 500 మంది రైతులకు పంపిణీ చేశామన్నారు.మిగతా పాస్ పుస్తకాలు ఒకటి రెండు రోజులలో పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. అదేవిధంగా భూ సమస్యలు పరిష్కారమై, పక్కాగా ఉన్న పాస్ పుస్తకాలు చేతికి అందడం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని,రైతుకు భూమిపై పూర్తి హక్కు కల్పించడమే కాకుండా,ఏటువంటి వివాదాలకు తావు లేకుండా,పారదర్శకమైన అని రికార్డులను అందించడమే రాజముద్రతో కూడిన పుస్తకాలు అందించనున్నామన్నారు. ఈ కార్య క్రమంలో ఆర్ఐ రాజేష్, విఆర్ఓ రమణ, టిడిపి నాయకులు ఎం.బాబుల్ రెడ్డి, కె.ఆంజనేయులు, గ్రామ రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ప్రజాప్రతినిధులు, ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా మారిన ఆర్టీసీ బస్టాండ్‌ను తక్షణమే వాడుకులోకి తీసుకురావాలి

### - సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం :** మండల కేంద్రంలో ప్రజాధనంతో నిర్మించినటువంటి నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను తక్షణమే వాడుకులోకి తీసుకొని రావాలని రాయచోటి నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు సిపిఐ లక్కిరెడ్డిపల్లి మండల కార్యదర్శి కే.ఓబులేసు పేర్కొన్నారు. గురువారం నిరుపయోగంగా ఉన్న బస్టాండ్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాల్సిన బస్టాండ్ రాజకీయ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వల్ల ప్రజలకు భారంగా మారింద న్నారు. ప్రయాణికులు నిల్చునే స్థలం లేక, మరుగుదొడ్లు,తాగునీరు, షెడ్లు వంటి కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారూ అని మరోవైపు సిద్ధంగా ఉన్న బస్టాండ్ ను వాడకుండా వదిలేయడం ప్రజాధనానికి తీరని నష్టం అని సంబంధిత శాఖలు తక్షణ మే స్పందించి నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను పూర్తి స్థాయిలో వాడు కులోకి తీసుకురావాలని తెలిపారు. లేకపోతే ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మాతా శిశు మరణాలపై సమీక్ష



**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం:** అనంతపురం వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఈ.బి దేవి అధ్యక్షతన మాతా శిశు మరణాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా జరిగిన ఆరు శిశు మరణాలు మరియు రెండు మాతృ మరణాల పైన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డియంహెచ్ఓ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది మాతా శిశు సంరక్షణపై తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. గర్భిణులు ప్రసవానంతర సేవలలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. బాలింత సంరక్షణలో వైద్య సిబ్బంది సేవలు అందించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న పరీక్షలపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా సంబంధిత అధికారులు సమావేశాలు జరపాలని పేర్కొన్నారు. గర్భవతిగా ఉన్న సమయంలో అందాల్సిన సేవలు, ప్రసవానంతర సేవలపై క్షత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మాతా శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డా.డేవిడ్ సెల్వ రాజ్, డిసిహెచ్ఎస్, డా.పద్మశ్రీ, గైనకాలజిస్ట్ డా.సోమ శేఖర్ అనస్తీసియా, డా.రాధిక పీడియాట్రిషన్, డా.నవీన్ కుమార్ పీడియాట్రిషన్, డా.శశిభూషణ్ రెడ్డి డిఐఓ, డా. శ్రీనివాస్ రెడ్డి డి.పి.ఏం.ఓ, డా.విష్ణుమూర్తి, ప్రమీలా దేవి, హేమలత పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎంపీ అవినాష్ రెడ్డి





**సింహాద్రిపురం - సూర్య వాస్తవం :** సింహాద్రిపురం మండలంలోని బలపనూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వెలుగోటి రామాంజల్ రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసు కొని కడప ఎంపీ అవినాష్ రెడ్డి గురువారం గ్రామానికి వెళ్లి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే సింహాద్రిపురానికి చెందిన వైసీపీ నాయకుడు మధుసూదన్ రెడ్డి తల్లి మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని అలాగే సుంకేసుల గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు నారాయణరెడ్డి, సోదరుడు మహేశ్వర్ రెడ్డి, బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందారు. వారి కుటుంబాన్ని అలాగే కోరుకుంటపల్లె గ్రామానికి చెందిన జయ కుమార్ రెడ్డి తండ్రి ఓబుల్ రెడ్డి మృతిచెంది విషయం తెలుసుకొని గురువారం మృతి చెందిన ఓబుల్ రెడ్డి మృతదేహానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. ఈయన వెంట వైసీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మండల వైసీపీ నాయకులు రఘునాథ రెడ్డి, రాచమల్లు రామకృష్ణారెడ్డి వెలుగోటి చంద్రశేఖర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి కిషోర్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి పటేల్ రెడ్డి, శివారెడ్డి గంగాధర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, సిలార్ భాష మంగలి శీను, అనిల్ కుమార్ రెడ్డి, రామకోటిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, రామిరెడ్డి, రమణారెడ్డి, కంభం మహేశ్వర్ రెడ్డి విజయ్ కుమార్ రెడ్డి ద్వారకనాథరెడ్డి మహేశ్వర్ రెడ్డి విశ్వనాథరెడ్డి రమణయ్య ప్రవీణ్ కుమార్ రెడ్డి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# కుటిల కుతంత్ర రాజకీయాలు చేయబోం

- ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టిన వైకాపా పార్టీకి విధేయులమే
- మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప



**పులివెందుల - సూర్య వాస్తవం:** అధికార పార్టీ ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన వైయస్ జగన్మోహన్ రెడ్డికి, అవినాష్ రెడ్డికి దూరం కాబోమని, నీతి నిజాయితీతో పార్టీకి విధేయులుగా పనిచేస్తామని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ చిన్నప్ప పేర్కొన్నారు. పులివెందులలోని జగన్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసినటువంటి విలేకరుల సమావేశంలో ముంతల్ మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ తాము అభివృద్ధిపై మాట్లాడామని వ్యక్తిగతంగా విమర్శించలేదని, కొన్ని వర్గాలను టార్గెట్ చేస్తూ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా మీరు చేస్తున్నటువంటి ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, దమ్ము ధైర్యం ఉంటే నాపై దాడి జరిగిందంటూ చేస్తున్న వ్యాఖ్యలను నిరూపించాలని, నీతి నిజాయితీగా రాజకీయం చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నామని ఎవరి దగ్గర ఎటువంటి కమిషన్లు ఆశించలేదని, డబ్బు ఆశ చూపిన, కేసులతో ఇబ్బంది పెట్టిన భయపడబోమని, మీ నాయకులే ప్రభుత్వ భూములను కబ్జా చేసి, ప్రైవేటు భూములను కొనుగోలు చేసి డబ్బులు చెల్లించకుండా కోర్టులు చుట్టూ తిప్పుతున్నారని పేర్కొన్నారు. మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప మాట్లాడుతూ గతంలో నాపై కేసులు నమోదయాయని చేస్తున్నటువంటి వ్యాఖ్యలలో నిజం లేదని సాధారణ తనిఖీల్లో భాగంగానే గతంలో మా షాపును తనిఖీ చేసి క్లీన్ చిట్ ఇచ్చారని అదేవిధంగా వాటర్ ప్లాంట్ వివాదానికి సంబంధించి ఇరు వర్గాలను సమన్వయపరిచి సమస్యను సద్దుమణిగేలా చేసామని వారి ఆరోపణలను తిప్పికొట్టారు, ఈ ఆరోపణలు నిరూపిస్తే బహిరంగ క్షమాపణలు చెప్పి పార్టీకి రాజీనామా చేస్తానని లేనిపక్షంలో మీరు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సివిల్ సప్లై డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, కౌన్సిలర్ కిషోర్ కనక తదితరులు పాల్గొన్నారు.

## పల్లా శ్రీనివాసరావుని కలిసిన టీడీపీ అధ్యక్షుడు పూల నాగరాజు

**అనంతపురం - సూర్య వాస్తవం:** టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుని అనంతపురం జిల్లా టిడిపి అధ్యక్షుడు పూల నాగరాజు కలిశారు. నేడు విజయవాడలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావుని జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి రాష్ట్ర అధ్యక్షుడిని పూల నాగరాజు కలిశారు. జిల్లాలో పార్టీ బలోపేతం, రానున్న స్థానిక ఎన్నికలపై ఇరువురు చర్చించుకున్నారు.



## డిప్యూటీ డెమోగా బాధ్యతలు స్వీకరించిన ప్రసన్నకు సన్మానం



**పులివెందుల - సూర్య వాస్తవం :** యుపిహెచ్‌సి నగరిగుట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసిన ఆరోగ్య విద్యాధికారిణి ఆర్. ప్రసన్నలత ప్రమోషన్‌పై కడప జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో డిప్యూటీ డెమోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భం గా డిప్యూటీ డిఎంహెచ్ఓ కాజా మొద్దిన్ మాట్లాడుతూ వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రసన్నలత ప్రజలకు అద్భుతమైన అవగాహన కార్యక్రమాలు, నగరి గుట్ట పెరఫార్మెన్స్ లిస్ట్‌లో వున్న ధాన్నిఇంప్రూవ్ మెంట్ జరిగిందనీ కొనియాడారు. అదేవిధంగా తన శేష జీవితంలో మరిన్ని కార్యక్రమాలు ప్రజ లకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా చిరుసత్కారంతో దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నేహా ప్రత్యూష, డాక్టర్ శాంతి కుమార్, సూపర్‌వైజర్ సతీష్ కుమార్ ఏఎన్మ్స్, ఆశా, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అనుమతి లేని ఎరువులు.. మూసిన దుకాణాలు..

### - తొండూరులో కలకలం...

**తొండూరు - సూర్య వాస్తవం:** తొండూరు మండలం పరిధిలోని ఎరువుల దుకా ణాల్లో జరుగుతున్న అక్రమాలపై వ్యవసాయ శాఖ అధికారులు మెరుపు తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారి ఏడీ రామోహనరెడ్డి, ఏఓ కె.రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘనలు వెలుగు లోకి వచ్చాయి. కొన్ని దుకాణాల్లో తప్పనిసరిగా నిర్వహించాల్సిన స్టాక్ రిజిస్టర్లు, అమ్మకపు రికార్డులు లేకపోవడం, అనుమతులు లేని ఎరువులు, పురుగుమందులను యథేచ్ఛగా విక్రయి స్తున్నట్లు అధికారులు గుర్తించారు. తనిఖీలు ప్రారంభమవగానే మరికొన్ని దుకాణాలు హడావుడిగా తాళాలు వేసుకుని మూసివేసి వెళ్లిపోవడం తీవ్ర అనుమానాలకు తావిచ్చింది. రైతుల నమ్మకాన్ని దోచుకునే ఇలాంటి అక్రమాలకు తావి వ్వబోమని, నిబంధనలు ఉల్లంఘించిన దుకాణదారులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుం టామని వ్యవసాయాధికారి కె.రాజు స్పష్టం చేశారు. తొండూరు మండలం వ్యాప్తంగా ఈ తరహా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.



## కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో

# నిర్దేశించిన లక్ష్యలను పూర్తి చేయాలి

- ప్రజలకు సంతృప్తికర స్థాయిలో సేవలందించాలి
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**కడప/అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత పథకాల అమలులో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని, ప్రజలకు సంతృప్తికర స్థాయిలో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం మదనపల్లి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలపై... పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, సాంఘిక, వెనుకబడిన తరగతుల సంక్షమ, గిరిజన సంక్షమ, ఐసిడిఎస్ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలలో పెండింగ్లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో... పింఛన్ల పంపిణీ, గ్రామపంచాయతీ సేవలు, ఆర్టీసీ సేవలు, రిజిస్ట్రేషన్ సేవలు, తదితర సేవలపై ప్రజల నుండి తీసుకున్న అభిప్రాయాలు, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించగా మదనపల్లె కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సంతృప్తికరస్థాయిలో సేవలు అందించాలని ప్రజల నుంచి తీసుకున్న అభిప్రాయాలను సమీక్షంచుకొని నిర్దేశించిన లక్ష్యలను చేరుకోవాలన్నారు. ఎమ్మెస్ ఎంఈ పార్కుల ఏర్పాటులో భూ సమీకరణ పెండింగ్లో ఉంటే వెంటనే దానిపై తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## పుట్టా ప్రీమియర్ క్రికెట్ లీగ్

# టి10 సీజన్-2 ప్రారంభించిన ఎమ్మెల్యే





**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** బ్రహ్మంగారిమఠం మండలం నందిపల్లె ఎన్.గొల్లపల్లె ఎన్జి గ్రౌండ్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా మైదుకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆశీస్సులతో కడప జిల్లా టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జున రెడ్డి నిర్వహిస్తున్న పుట్ట ప్రీమియర్ లీగ్ టి10 సీజన్- 2 క్రికెట్ టోర్నమెంట్‌ను మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ గురువారం ప్రారం భించారు. మొదటగా సుధాకర్ యాదవ్ బ్యాట్ పట్టి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ టోర్నమెంట్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. 50వేలు, రెండవ బహుమతి రూ. 30వేలు, తృతీయ బహుమతి రూ. 10 వేలు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, తెలుగుదేశం నాయకులు మిల్లు శీను, సొసైటీ అధ్యక్షుడు సాంబశివరెడ్డి, పూజ శివయ్య యాదవ్, భీమ్ నాయుడు, మేకల సుధాకర్, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ,ప్రజలు ఉన్నారు.

## పట్టాదారు పాస్ పుస్తకంలోని క్యూఆర్ కోడ్ ద్వారా

# భూమి వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు

- దేవలపల్లి గ్రామంలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్





**కడప /అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం**

పట్టాదారు పాసుపుస్తకంలోని క్యూఆర్ కోడ్ ద్వారా భూ యజమాని, భూమి వివరాలు సులభంగా తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం కలకడ మండలం దేవలపల్లి గ్రామంలోని గ్రామ సచివాలయంలో నిర్వహించబడిన పట్టాదారు పారసీ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... జిల్లాలో నిర్వహించబడుతున్న రెవెన్యూ గ్రామ సభలలో రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రతో కలిగిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రిసర్వే కార్యక్రమంలో అధునాతన సాంకేతికత ద్వారా భూ సమస్యలను మరియు వివాదాలను పరిష్కరించగలుగుతామన్నారు. ఈ అధునాతన సాంకేతికతతో సెంటీమీటర్ కూడా తేడా జరగకుండా రీ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. అధునాతన సాంకేతికత ద్వారా రైతుకు ఎంత భూమి ఉంది, ఎక్కడ ఉంది తదితర అంశాలను చాలా స్పష్టంగా మరియు సులభంగా గుర్తించగలుగుతామన్నారు. రెవెన్యూ గ్రామ సభలను సచివాలయ స్థాయిలో నిర్వహిస్తున్నామని ప్రజలందరూ ఈ కార్యక్రమాలను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్. పలువురు లబ్ధిదారులతో పట్టాదారు పాసుపుస్తకం లో సరైన వివరాలు నమోదు చేసి ఉన్నారా లేక ఏమైనా తప్పులు ఉన్నాయా, ఆధార్ నెంబరు సరిగా ఉందా వంటి పలు ప్రశ్నలను అడగగా సరైన వివరాలను చేర్చి ఉన్నారని లబ్ధిదారులు సమా ధానం ఇచ్చారు. పట్టాదారు పాస్ పుస్తకాలలో తప్పులు దొర్లితే వెంటనే పరిష్కరించాలని మండల తహశీల్దారును ఆదేశించారు. మండల తహశీల్దారు మహేశ్వరి మాట్లాడుతూ... నూతన పట్టాదారు పాసు పుస్తకాలను లబ్ధిదారు కానీ లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఎవరైనా వచ్చి పాత పుస్తకాన్ని ఇచ్చి నూతన పట్టాదారు పాసు పుస్తకాన్ని తీసుకోవచ్చని సూచించారు. నూతన పట్టాదారు పాసుపుస్తకంలోని క్యూఆర్ కోడ్ను ఏ విధంగా విని యోగించుకోవాలి అనే అంశంపై పాసుపుస్తకాలు తీసుకోవడానికి వచ్చిన లబ్ధిదారులకు కూలంకషంగా వివరించారు. ఆధార్ నెంబరు ఫోన్ నెంబరు, ఇతర వివరాల్లో తప్పులుంటే వెంటనే అర్జి పెట్టుకొని పరిష్కరించుకోవచ్చని సూచించారు.

# అన్నమయ్య జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు

- అప్రమత్తమైన పోలీసులు



**మదనపల్లె - సూర్య వాస్తవం :**

అన్నమయ్య జిల్లా మదనపల్లె కోర్టులో బాంబు పెట్టినట్లు గురువారం బెదిరింపు సమాచారం అందడంతో పోలీసులు అప్రమత్త మయ్యారు. ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాలతో డిఎస్పీ సూచనల మేరకు సీఐలు రవి నాయక్, కళా వెంకటరమణ, ఎస్ఐలు సిబ్బందితో వచ్చి, న్యాయమూర్తులను, న్యాయవాదులను, కోర్టు సిబ్బందిని, కక్ష్యదారులను బయటకు పంపించారు. కోర్టు ఆవరణలో పోలీసులు, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు చేపట్టారు. హై అలెర్ట్‌ను ప్రకటించడంతో పట్టణంలో ఉద్రిక్త వతావరణం నెలకొంది. మదనపల్లె కోర్టు సముదాయంలోని అన్ని కోర్టుల ప్రాంగణంలో పోలీసులు అణువణువునా గాలించి క్షణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఎక్కడా బాంబు ఉన్నట్లు ఆచూకి తెలియక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## అధికారులు పరిశీలించినా

# రైతుకు నష్టపరిహారం అందదా!



**తొండూరు - సూర్య వాస్తవం :** ఖరీఫ్ సీజన్లో కురిసిన అకాల వర్షాల కారణంగా ఉల్లి పంట తీవ్రంగా నష్టపోయింది. ఈ విషయాన్ని ఉద్యానశాఖ అధికారులు స్వయంగా పరిశీలించి, పంట నష్టానికి సంబంధించిన ఫోటోలు కూడా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉల్లి పంట నష్టపరిహారం అందరికీ అందిస్తున్న క్రమంలో.. రైతు బూచుపల్లి ఓబుళకొండారెడ్డికి ఇప్పటివరకు పంట నష్టపరిహారం మంజూరు కాలేదు. తనతో పాటు మరికొందరికి మాత్రం ఎలాంటి సాయం అందకపోవడం అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "అధికారులే వచ్చి పంటను పరిశీలించిన.. ఫోటోలు కూడా తీసుకున్న.. పంట నమోదు చేసుకున్న.. నాకు రూపాయి కూడా రాలేదు" అని ఆయన వాపోయారు. పంట నష్టం కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నమని తనకు వెంటనే న్యాయం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారులను ఆయన కోరుతున్నారు. ఈ ఘటనతో రైతుల్లో అసంతృప్తి పెరుగుతోంది. "సర్వే చేసి, ఫోటోలు తీసినా పరిహారం రాకపోతే రైతుల నమ్మకం ఎలా నిలుస్తుంది?" అని పలువురు రైతులు ప్రశ్నిస్తు న్నారు. జిల్లా స్థాయి అధికారి స్వయంగా పరిశీలించినప్పటికీ పరిహారం అందకపోవడం వ్యవస్థ లోపమా? అధికారుల లోపమా?అనే సందేహాలు పలువురు వ్యక్తపరుస్తున్నారు.

# విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం :** విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ శోభ పేర్కొన్నారు. గురువారం స్థానిక శ్రీ లక్ష్మి వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శోభా మాట్లాడుతూ గంజాయి ఇతర మత్తు పదార్థాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వాటి జోలికి వెళ్లి నిండు నూరేళ్ల జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ మెలకువలు పాటించాలని అనవసరమైన వెబ్ సైట్లను ఓపెన్ చేయరాదని ఎవరికి ఓటీపీలను చెప్పరాదని ఆర్థిక నేరాల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపరాదని త్రిబుల్ రైడింగ్ చేయరాదని ప్రతి ఒక్కరూ లైసెన్స్ తప్పనిసరిగా పొందాలని తెలిపారు. విద్యార్థినులకు గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్‌ల గురించి అవగాహన కల్పించారు. ఆకతాయిలు విద్యార్థినులను ఏడిపిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1098,100,112 తెలియజేయాలన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు ఇతర చెడు వ్యసనాలకు లోను కాకుండా చదువు పైన దృష్టి సారించి ఉన్నత పదవులను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖతోపాటు కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి

# ఐడిబిఐ బ్యాంక్ భారీ సాయం

- రూ.2.80 లక్షల విలువ గల ఫర్నీచర్ వితరణ...

**మదనపల్లె - సూర్య వాస్తవం:** మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి, ఐడిబిఐ బ్యాంక్ గురువారం భారీ సాయం అందించింది. మదనపల్లి ఐడిబిఐ బ్యాంక్ మేనేజర్ జొన్నలగడ్డ సురేష్, చిత్తూరు బ్యాంకు మేనేజర్ వేలాయన్, ఫీల్డ్ ఆఫీసర్ నారాయణ, అముల్ కుమార్ తదితరులు సిఎస్ఆర్ నిధులతో రూ. 2.80 లక్షల విలువైన ఫర్నిచర్‌ను ఆస్పత్రికి సాయంగా అందజేశారు. 10 వీల్ ఛైర్స్, 5 స్ట్రెచర్లు, 5 త్రీ సీటర్ బెంచ్ లు, 4 ఇన్వర్టర్ బ్యాటరీస్, 10 ఫాన్‌లను జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్, ఆర్ఎంఓ షకూర్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఐడిబీఐ మేనేజర్ జొన్నలగడ్డ సురేష్ మాట్లా డుతూ పేద రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రిలో తమఅబశ్రీశ్రీవంతు బాధ్యతగా రోగులకు ఉపయోగకరంగా ఉండే ఫర్నీచర్‌ను అందజేయడం జరిగిందన్నారు. వీటిని పేద రోగుల సౌకర్యం వినియోగించాలని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్ మాట్లాడుతూ ఐడిబిఐ బ్యాంకు నిర్వాహకులు పెద్దమనసుతో ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని రోగులకు ఉపయోగపడే ఫర్నిచర్ వితరణ గా అందజేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దీంతో ఆస్పత్రిలో కొంత మేర పర్నీచర్ కొరత తీరిందన్నారు. పేద రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఐడిబీఐ బ్యాంకు అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# ముగిసిన జాతీయ సేవా పథక కార్యక్రమాలు

**- ఏదైనా పని ఇష్టంతో చేస్తే కచ్చితంగా విజయవంతమవుతుంది**



**పులివెందుల– సూర్య వాస్తవం :** పులివెందులలోని ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలకు చెందిన నాల్గవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు “జాతీయ సేవా పథకం” లో భాగంగా ఏడు రోజుల పాటు అనగా 02 జనవరి నుండి 08 జనవరి వరకు లింగాల మండలం పెద్దకుడాల గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం గురువారం జనవరి 8 న ఘనంగా ముగిసింది. ఇదే రోజున గ్రామంలో “మొక్కలు నాటే కార్యక్రమం” నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గ్రామ సర్పంచ్ పి.దేవి విచ్చేసారు. ప్రత్యేక అతిధు లుగా లింగాల మండలం పెద్దకూడాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎం.ఈ.ఓ రామకృష్ణయ్య, స్కూల్ అధ్యాపకుడు వాసుదేవ రెడ్డి ఈ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ అధ్యక్షతన జరిగింది. కళాశాల జాతియ సేవా పథకం అధికారి ఇంజనీర్ నజ్మా, డాక్టర్ జయమ్మ ఈ ఏడు రోజుల కార్యక్రమాలను గురించి సభలో సంక్షప్త నివేదికగా వివ రించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన సర్పంచ్ పి.దేవి ఎన్ఎస్ఎస్ విద్యార్థి వాలంటీర్లు గ్రామంలో బాగా సేవ చేశారని అభినందించారు. ప్రత్యేక అతిధిగా వచ్చిన ఎంఈఓ రామ కృష్ణయ్య ఎన్.ఎస్.ఎస్ విద్యా వాలంటీర్లును ఉద్దేశిస్తూ ఏదైనా పనిని మనం ఇష్టంతో చేస్తే ఆ పని కచ్చితంగా విజయవంత మవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ సొంత ఎదుగుదలతో పాటు సమాజానికి కూడా సేవ చేయాలని



తెలిపి ఇటువంటి జాతీయ సేవా పథకం కార్యక్రమాలు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ మాట్లాడుతూ ఈ ఏడు రోజుల చేసిన సేవ ప్రేరణగా తీసుకొని, ఇటువంటి సమాజ సేవ భవిష్యత్తులో కూడా కొనసాగించాలని ఎన్ఎస్ఎస్ విద్యార్థి వాలంటీర్లను ఉద్దేశిస్తూ మాట్లాడారు. ఈ ఏడు రోజుల కార్యక్రమం విజయవంతం చేసినందుకు గ్రామస్థులకు, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లుకు ధన్యవాదాలు తెలిపారు. కొందరు గ్రామస్థులు మాట్లాడుతూ ప్రత్యేక శిభిర కార్యక్రమాలు బాగా చేసారని, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు తమను ఎంతో ఆప్యాయంగా రోజు పలకరించేవారని సభలో తమ అభిప్రాయాలు తెలిపారు. ముగింపు రోజు జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో మందార మొక్కలు నాటే కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థి వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఉత్సాహవంతులైన గ్రామస్థులు, కళాశాల అసో సియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ, జాతియ సేవా పథకము కార్యక్రమ అధికారులు ఇంజనీర్ నజ్మా, డాక్టర్. జయమ్మ, ముఖ్యఅతిథి సర్పంచ్ దేవి, ప్రత్యేక అతిధులు ఎంఈఓ రామ కృష్ణయ్య, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు వాసుదేవ రెడ్డి, జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు, ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అధ్యాపకులు డాక్టర్ రాజేష్, డాక్టర్ సాయి శ్రీనివాస్, పీడి. డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ప్రదీప్ కుమార్, నాల్గొవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారు.

# కులాల ప్రస్తావనతో రాజకీయం తగదు

**- కోటి రూపాయలతో కొనుగోలు చేసిన వ్యక్తిత్వం వరప్రసాద్‌కు లేదు**
**- వరప్రసాద్ వ్యాఖ్యలపై టీడీపీ నాయకుల మండిపాటు**



**పులివెందుల– సూర్య వాస్తవం :** రాజకీయానికి కులం పేరు వాడుకొని పబ్బం గడుపుకోవడం సరికాదని, కోటి రూపాయ లతో కొనుగోలు చేసెంత వ్యక్తిత్వం వరప్రసాద్ కు లేదని తెదేప నాయకులు మెహబూబ్ భాష మరియు భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో వారు మాట్లాడుతూ ఒక అమ్మకు, ఒక అబ్బకు పుట్టిన వ్యక్తిగా మాట్లాడుతున్నాను. రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలకు పోకూడదనే ఉద్దేశంతో నిన్న కూడా నేను చాలా గౌరవంగా వివరణ ఇచ్చాను. కానీ ఈరోజు అతను పరిధి దాటి అవాంఛ నీయ పదజాలంతో మాట్లాడుతున్నారు? నాకు 49 సంవత్సరాల వయస్సు, ఇక్కడ బెతెల్ చర్చి దగ్గరే నివాసం ఉంటున్నాను. నా గురించి, నా పుట్టుక గురించి ఆ ఏరియాలో ఎవరిని అడిగినా చెబుతారు. నువ్వు కూడా పాత రవీంద్రనాథ్ హైస్కూల్ సమీపంలో, రాజారెడ్డి ఇంటి దగ్గరే ఉన్నావు. నీ పుట్టుక గురించి అక్కడ ప్రజలే చెబుతారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం మానుకో. నీవు ప్రమాణం చేస్తాను అన్నావు కదా, నేను రేపు ఉదయం 11 గంటలకు సుంకులమ్మ దేవాలయం దగ్గరకు వస్తాను నీకు



చేతనైతే వారిని తీసుకువచ్చి ప్రమాణం చేయించా లని, నువ్వు చర్చికి రమ్మన్నా, మసీదుకు రమ్మన్నా నేను సిద్ధం. నేను పవిత్రంగా ఉంటానని, మున్సిపల్ నామినేటెడ్ చైర్మన్ వరప్రసాద్ నీ చరిత్ర పులివెందుల మున్సిపాలిటీ అందరికీ తెలుసు. నీవు జైలులో ఉన్నప్పుడు నీ భార్య, నీ బావమరిది శంకర్, మీ మామగారు కలిసి మమ్మల్ని బ్రతిమలాడలేదా? “మా భర్తను కాపాడండి, మేము తెలుగుదేశం పార్టీలోకి వస్తాము” అని వారు చెప్పలేదా? నీకు తెలియకపోతే మీ ఇంట్లో వారిని అడిగి తెలుసుకో. నోరు అదుపులో పెట్టుకోకపోతే మర్యాద ఉండదని వరప్రసాద్ ప్రతి దాంట్లో అభివృద్ధి చేశామని చెబుతున్నారు. రింగ్ రోడ్డులో వైఎస్ఆర్ విగ్రహాలు పెట్టడం, తీయడం మళ్ళీ పెట్టడమే అభివృద్ధి అనుకుంటున్నారా? గత మూడేళ్లుగా కేవలం కమిషన్ల కోసం ఇదే పని చేస్తున్నారు. పులివెందులలో పాత బస్టాండు అందరికీ ఎంతో సౌకర్యంగా ఉండేది. ఇప్పుడు కొత్తగా కట్టిన బస్టాండు వర్షం వస్తే ఎలా ఉంటుందో ప్రజలు చూస్తున్నారు. మినీ సెక్రటేరియట్ పరిస్థితి కూడా అంతే. ఏ పనీ పూర్తి స్థాయిలో చేయడం లేదు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ వాడిన పదజాలం సరికాదని, గరుడాద్రి ప్రాజెక్టులో పని చేయకుండా కేవలం కమిషన్ల కోసం మీరు ఎలా కొట్లాడారో మాకు తెలుసునని, కంకర మిషన్ల విషయంలో హైదరాబాద్ వరకు జరిగిన పంచాయతీలు మాకు తెలుసు. వచ్చే ఎపిసోడ్లలో నీ అవినీతి గురించి పూర్తి క్లారిటీ ఇస్తాను ఆవేశపడకుండా వేచి చూడాలని హితువు పలికారు.

# 108 సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తాం..

**- ఈ నెల 12 తర్వాత ఎప్పుడైనా 108 ఉద్యోగుల సమ్మె..**
**- మదనపల్లె అన్నమయ్య కలెక్టరేట్ ఎదుట నిరసన...**




**మదనపల్లె – సూర్య వాస్తవం :** 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయకపోతే ఈ నెల 12వ తేదీ తర్వాత ఏ క్షణమైన సమ్మెకు వెళ్తామని 108 కాంట్రాక్ట్ ఉద్యోగుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవాధ్యక్షలు ఎ.రామాంజులు, జిల్లా అధ్యక్షలు రమణ యాదవ్, ప్రధాన కార్యదర్శి బీవీ చలపతిలు పేర్కొన్నారు. గురువారం 108 కాంట్రాక్టు ఉద్యోగుల యూనియన్ (సీఐటీయూ) పిలుపు మేరకు స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపిన అనంతరం డి.ఆర్.ఓ మధుసూదన్‌కు సమ్మె నోటీస్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లా డుతూ ప్రభుత్వం వేతనం రూ. 4,000 లు పెంచుతూ జి. ఓ నంబర్ 49 ఇచ్చినప్పటికి పూర్తి స్థాయి వేతనం అమలు చేయ కుండా కేవలం రూ 2 వేలే ఇవ్వడం సరికాదన్నారు. ఉద్యోగుల వేతనం నుండి పిఎఫ్ కట్ చేసుకుని యాజమాన్యం వాటా పిఎఫ్ బ్యాంక్ ఖాతాకు జమచేయకపోవడం ఉద్యోగులను మోసం చేసే దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. ఒక్కొక్క నెలలో కొందరికి కారణం తెలపకుండా వేతనం తగ్గించి ఇస్తున్నారని, కనీసం పేస్లిప్ కూడా ఇవ్వకుండా వ్యవహా రిస్తున్నా, భవ్య యాజమాన్యంపై అధికారుల చర్యలు శూన్యమని, చిన్న.. చిన్న కారణాలు చూపి ఉద్యోగులను విధుల నుండి తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు 18 ఏళ్ల నుండి సర్వీసు ఉన్న వారికి మళ్ళీ పరీక్ష నెగ్గడం ద్వారా నియామకం పొడిగిస్తామనడం ఉద్యోగ భద్రత గాల్లో దీపంలా ఉందన్నారు. వెంటనే పరీక్షలు రద్దు చేసి, 5 ఏళ్ల సర్వీస్ ఉన్న వారికి స్లాబ్ అప్గ్రేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిలీవింగ్ బిల్లులు, ఐటీ డి ఏ అలవెన్స్ లు క్రమం తప్పకుండ ఇవ్వాలన్నారు. క్యాజువల్ లీవులు, పండుగ సెలవులు అమలు చేయాలని పేర్కొన్నారు. పని చేసే ప్రదేశంలో షెల్టర్ వాహన క్లీనింగ్ వంటి సౌకర్యాలు కల్పించాలని, 8 గంటలు పని అమలు చేయాలని కోరారు. వాహన మరమ్మతులు సిబ్బంది కాకుండా ప్రభుత్వం చేయించి సిబ్బంది కి అప్పుల ఉపశమనం కలిగించాలని కోరారు. జిల్లా కు ఒకటి కాకుండా డివిజన్‌కి ఒక గ్యారేజ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా నలుమూలల నుండి 108 సిబ్బంది పాల్గొన్నారు.

## బొలెరో ఢీకొని స్కూటరిస్టు దుర్మరణం



**మదనపల్లె – సూర్య వాస్తవం:** అన్నమయ్య జిల్లా, మదనపల్లెలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గురువారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో సీటీఎంకు చెందిన వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ విషాదకర ఘటనపై ముదివేడు పోలీసుల కథనం.. మదనపల్లి మండలంలోని సిటిఎంకు చెందిన రెడ్డప్ప(50), సాయంత్రం బైకులో మదనపల్లె కు వస్తుండగా, అమ్మచెరువు మిట్ట టైల్స్ మార్ట్ వద్ద బోలోరో ఢీకొట్టి రెడ్డెప్ప తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి, బాధితున్ని వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించగా, డాక్టర్లు చికిత్సలు అందించేలోపే మృతి చెందాడు. మృతుని కుటుంబీ కులు ఆస్పత్రికి చేరుకొని విచారణ అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



**మదనపల్లె – సూర్య వాస్తవం:** ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం కురబలకోట మండలంలో చోటు చేసుకుంది. ముదివేడు పోలీసుల కథనం మేరకు.. మదనపల్లి మండలం, మాలేపాడుకు చెందిన నవీన్ కుమార్ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతను ద్విచక్ర వాహ నంలో భవన నిర్మాణ పనులకు అంగళ్లకు బయలుదేరాడు. ఇదే సమయంలో మదనపల్లి పట్టణం, ఎన్వీఆర్ లేఔట్‌కు చెందిన మహబూబ్ బాషా సొంత పనిమీద అంగళ్లుకు వెళ్లి ద్విచక్ర వాహనంలో తిరిగి మదనపల్లికి బయలుదేరాడు. ఈ రెండు వాహనాలు స్థానిక సర్కారు తోపు వద్ద ఎదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమా దంలో నవీన్ కుమార్, మహబూబాషాలు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108 లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చూస్తున్నారు.

## సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్టా



**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం :** బ్రహ్మంగారిమఠం మండలం గంగిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛ సంక్రాంతి గ్రామసభ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హాజర య్యారు. ఈ సందర్భంగా ఎంజిఎన్ఆర్ఇ జిఎస్ 20 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన సిసి రోడ్డును గురువారం మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. అలాగే బ్రహ్మంగారిమఠం టౌన్‌లో 40 లక్షల రూపాయల నిధులతో స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు, పిఆర్ డిఈ మధు, ఎంపీడీవో రామచంద్రారెడ్డి , ఎస్సై శివప్రసాద్, సాంబశివారెడ్డి, మైదుకూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, తెలుగుదేశం పార్టీ మండల నాయకులు పూజా శివయ్య యాదవ్, గంగిరెడ్డి పల్లె సురేంద్ర, జనసేన నాయకులు ధరిమిశెట్టి రాజేష్, రవి రాయల్ తదితరులు ఉన్నారు.

## ఎంఆర్వో కార్యాలయంలో బీఎల్ఓల సమావేశం



**కనేకల్– సూర్య వాస్తవం:** కనేకల్ పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బీఎల్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2025 సంవత్సరానికి సంబంధించి ఓటరు జాబితా సిద్ధం చేసే ప్రక్రియలో భాగంగా, 2002 ఓటరు జాబితాలో ఉన్న ఓటర్లను 2025 ఓటరు జాబితాలో ఉన్న ఓటర్లతో మ్యాపింగ్ చేసే పనిని బీఎల్ఓలు త్వరితగతిన పూర్తి చేయాలని తహశీల్దార్ బ్రహ్మయ్య సూచించారు.మ్యాపింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ సందర్భంగా బీఎల్ఓలకు అవసరమైన విధివిధానాలపై స్పష్టమైన సూచనలు అందించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ బ్రహ్మయ్య, సూపర్‌వైజర్ ఆర్ఎస్‌డీటీ విజయ్‌కుమార్, జేఏ రాజ్‌బీతో పాటు బీఎల్ఓలు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకుడు రామచంద్రారెడ్డిని పరామర్శించిన ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని చెరువు ముందరపల్లి గ్రామంలో నివాసముంటున్న వైయస్సార్సీపీ నాయకుడు ఆదిరెడ్డి కుమారుడు రామచంద్రారెడ్డి ఇటీవల టిడిపి కార్యకర్తల దాడిలో గాయపడిన విషయం తెలుసుకుని లక్కిరెడ్డిపల్లి మండల ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన గాయపడిన వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసాని ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని ఎటువంటి సమస్య వచ్చిన ముందుండి పోరాడుతామని ధైర్యాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్ సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి మైనార్టీ నాయకులు జాకీర్ చాన్ భాష తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులతో సందడిగా సమగ్ర శిక్ష కార్యాలయం

- నాలుగు రోజులుగా తరలివస్తున్న నిరుద్యోగులు
- నోటిఫికేషన్ ప్రకటించకపోవడంతో నిరాశ
- ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు
- చంటిబిడ్డల తల్లుల బాధలు వర్ణనాతీతం
- కనీస వసతులు కూడా లేక అల్లాడుతున్న వైనం
- నాలుగు రోజులుగా నిరుద్యోగులు పోటెత్తుతున్నా ఒక్క ప్రకటన విడుదల చేయని ఎస్.ఎస్.ఎ అధికారులు
- నిరుద్యోగులకు సర్దిచెప్పిన జీసీడీఓ కవిత
- ఫోన్ చేస్తే స్పందించని ఎస్.ఎస్.ఎ ఏపీసీ శైలజ



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం:** అనంతపురంలోని సమగ్ర శిక్ష కార్యాలయం నిరుద్యోగులతో సందడిగా మారింది. జిల్లా నలుమూలల నుంచి భారీగా నిరుద్యోగులు తరలివస్తున్నారు. రాష్ట్రం లోని అన్ని జిల్లాల్లోని కేజీబీవీల్లో అవుట్ సోర్సింగ్ కింద ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువ డినట్లు సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన ప్రచారం జరగడంతో నిరుద్యోగులు నాలుగు రోజులుగా అనంతపురం టీవీ టవర్ సమీపంలోని సమగ్ర శిక్ష కార్యాలయానికి నిరుద్యోగులు భారీగా తరలివస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు వేచి చూస్తున్నారు.

**నోటిఫికేషన్ వెలువడకనే..**

ఏ జిల్లాలో ఎన్ని ఖాళీలు ఉన్నాయ్, రోస్టర్ ఏంటి అనే వివరాలు సేకరించి సమగ్ర శిక్ష అధికారులు సమగ్ర నివేదిక రూపొందించి కలెక్టర్ అనుమతి కోసం పంపారు. ఇంకా కలెక్టర్ నుంచి అప్రూవల్ కాలేదు. ఈ విషయం తెలియక నిరుద్యోగులు భారీగా క్యూ కడుతున్నారు.

**జీసీడీఓ కవిత పదేపదే చెబుతున్నా..**

ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరుద్యోగులు పడిగాపులు కాస్తూ కనిపించారు. అయితే జీసీడీఓ కవిత అభ్యర్థులకు పదేపదే విజ్ఞప్తి చేసారు. ఫైల్ కలెక్టర్ కు పంపామని, అప్రూవల్ అయి రాగానే రెండ్రోజుల్లో నోటిఫికేషన్ ఇస్తామని, అభ్యర్థులు ఎవరూ ఎదురు చూడొద్దని పదేపదే విజ్ఞప్తి చేసారు. అయినా అభ్యర్థులు కదలకుండా ఉండిపోయారు. ఎక్కడెక్కడ ఏయే ఖాళీలు ఉన్నాయ్, రోస్టర్ ఏంటి అనే వివరాలు నోటిఫికేషన్‌లో వెల్లడిస్తామని ఆమె హామీ ఇచ్చారు. పత్రికల్లో ప్రకటనలు ఇచ్చాక రావాల్సిందిగా ఆమె సూచించారు.

# ఫ్లెమింగో ఫెస్టివల్‌కు సీఎం డిప్యూటీ సీఎంలకు ఆహ్వానం

- సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ







**నాయుడుపేట –సూర్య వాస్తవం :** సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నేలపట్టు, సూళ్లూరుపేట, భీములవారిపాలెం ప్రాంతాల్లో ఈ నెల 10, 11 తేదీల్లో ఆహ్లాదకర వాతావరణంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్ కు రావాలని కోరుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనిత, ఆనం రామ్ నారాయణ రెడ్డి, రామ్ ప్రసాద్ రెడ్డి, సవిత,కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్ లకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆహ్వాన పత్రికలు అందజేశారు.గురువారం అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో పాటు పలువురు మంత్రులను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి ఫ్లెమింగో ఫెస్టివల్ ఆహ్వాన పత్రికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్,జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ ఉయ్యాల ప్రవీణ్, సూళ్లూరుపేట ఏఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్,సూళ్లూరుపేట నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి ఆదినారాయణ రెడ్డి,తెలుగుదేశం పార్టీ నాయకులు నెలవల రాజేష్,బొమ్మన పళణి, టి కే రవి,పచ్చ మాధవ నాయుడు, శ్రీనివాసులు నాయుడు సెల్వం తదితరులు ఉన్నారు.

# సీమ ద్రోహిగా మారవద్దు

- బాబు కుట్రలు కుతంత్రాలు ఇంకా ఎన్నాళ్లు
- డాక్టర్ కుంచం హెచ్చరిక



**కమలాపురం – సూర్య వాస్తవం:** చంద్రబాబు కుట్రలు కుతంత్రాలు ఇంకా ఎన్నాళ్లు చేస్తావు సీమ ద్రోహిగా మారవద్దని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి హెచ్చ రించారు. గురువారం కమలాపురంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు పథకాన్ని ప్రారంభించిందని, ఇప్పటికే దాదాపు 900 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశారని, ఇది ముమ్మాటికీ ఆంధ్రప్రదేశ్, రాయలసీమ ప్రాంత ప్రజల ప్రజాధనమే అన్నారు. అభివృద్ధి వేరు రాజకీయాలు వేరు గత ప్రభుత్వంలో ప్రారంభించిన రాయలసీమకు ప్రాణ ప్రధాయిని వంటి రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టును ఏ లెక్కన పనులు ఆపారని ప్రశ్నించారు. దీనికి అంటే పనులు ఆపడానికి క్యాబినెట్ ఆమోదం ఉన్నదా దీనికి అసెంబ్లీ ఆమోదం ఉన్నదా ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆమోదం ఉన్నదా అని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ అసెంబ్లీలో చంద్రబాబు నాయుడుతో నేతంతంగా మాట్లాడి పనులు ఆపివేయించానని చెప్పినా పట్టించుకోలేదే ఇది ముమ్మాటికి రాయలసీమ ప్రజలకు తీవ్ర అవమానం కాదా ప్రజల్ని మోసం చేసే చీటింగ్ చేసే వంచించే హక్కు చంద్రబాబుకు ఎవరు ఇచ్చారని తెలిపారు. ఆయనకు ఏమన్నా కూటమి ప్రభుత్వం ఈ అధికారం ఇచ్చిందా అసలు రేవంత్ రెడ్డి చెప్పేదాకా ఇంత పెద్ద కుట్ర ఉన్నదని ఎవరికి తెలియదే అని వాపోయారు. ఇది ముమ్మాటికి దగా మోసం పనులు ఆపివేస్తే ఖర్చుపెట్టిన కోట్లాది రూపాయలు వాళ్ళ జేబులో నుంచి కడతారా అసలు పనులను ఆపి ప్రాజెక్టును రద్దు చేసే కుట్ర ఎందుకు చేస్తున్నారు ఇందులో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య ఉన్న లాలూచీ ఏమిటి దీనిని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు అధికారం కట్టబెట్టింది చీకటి ఒప్పందాలు చేసుకోవడానికి కాదు ఏపీ ప్రజలను మోసం చేయడానికి కాదు రాయలసీమ ప్రజలకు ద్రోహం చేయడానికి కాదు 40 ఏళ్ల రాజకీయ, పరిపాలన అనుభవం ఉందని దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఫోజులు కొడుతున్న చంద్రబాబు నాయుడు ఇంత దారుణంగా దగా మోసం చేస్తారా ఈ విషయంలో అఖిలపక్ష సమావేశాలను వ్యక్తి అన్ని పార్టీల వారిని పిలిచి అభిప్రాయం తెలుసుకోవాలి అనే ఇంగిత జ్ఞానం కూడా ముఖ్యమంత్రికి లేకపోవడం విడ్డూరమన్నారు. చంద్రబాబుది నేర చరిత్ర రాష్ట్ర ప్రజలు అందరికీ తెలుసు గత ప్రభుత్వం ప్రారంభించిందని కక్ష తోటి రాయలసీమ ప్రజల గొంతు కోస్తారా ఇది రాజకీయాలకు సంబంధం లేని రాయలసీమ లిఫ్ట ప్రాజెక్టు ఎంత ఖర్చయినా సరే దీనిని పూర్తి చేయవలసిందే

అట్లా అనుకుంటే ముఖ్యమంత్రిగా ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు దిగిపోయినప్పుడు, అధికారంలోకి వచ్చిన డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి బాబు పథకాలన్నీ కొనసాగించాడు. ఆ రాజనీతి నీకు ఎందుకు లేదు అని రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ తరపున ప్రశ్నిస్తున్నామని తెలిపారు. రాజకీయపరంగా జీవితం పరంగా చివరి దశలో ఉన్నావు. చంద్రబాబు చరిత్ర హీనులుగా మారవద్దు అని కోరారు. రాయలసీమ వాసి సీక్రెట్ గా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టును ఆపివేసి ద్రోహం చేస్తావా ఆ హక్కు నీకు ఎవరిచ్చారు ఈ విషయంలో రాష్ట్ర వ్యాప్త దేశ వ్యాప్త ఉద్యమానికి రెడీగా ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికైనా మెట్టు దిగి కూటమి ప్రభుత్వం రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని లేకుంటే రాయలసీమ తడాఖా చూపిస్తామని తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాయలసీమ పరువు తీస్తుంటే వారం రోజులు కావస్తున్నప్పటికీ చంద్రబాబు నాయుడు నోరు ఎందుకు మెదపడం లేదన్నారు.

**ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రతినిధిగా ఎందుకు స్పందించడం లేదు**

ఇందులో ఎన్ని కోట్లు మతలబ్ ఉంది సీమ గాని ఆంధ్రప్రదేశ్ గాని మీ వ్యక్తిగత సొత్తు కాదు ప్రజల ప్రాపర్టీకి మీరు కస్టోడియన్ మాత్రమే ఇష్టం వచ్చినట్టు చేస్తే చట్టం గానీ జనం గాని ఒప్పుకోరు గతంలో ఇట్లా చేసిన వాళ్ళు శంకరగిరి మాన్యాలు లెక్కబెడుతున్నారు.

కూటమి పాలకుల్లారా ఖబర్దార్ రేవంత్ రెడ్డితో ఉన్న లాలూచీకి బేషరతుగా ఆంధ్రప్రదేశ్ మరియు రాయలసీమ ప్రజలకు క్షమాపణ చెప్పండి. వెంటనే పనులు ప్రారంభించి నిధులు కేటాయించండి ప్రజల ముందుకు వచ్చి రాయలసీమ లిఫ్ట ప్రాజెక్టు పై మాట్లాడే దమ్ము ధైర్యం లేని చంద్రబాబు, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు ను పావులాగా వాడుకుంటున్నాడు. ఆయనతో అసలు విషయం చెప్పిస్తున్నాడు. ఇది దాదాపు రాజకీయం కాదని రాయలసీమ రాష్ట్ర పార్టీ తరపున ప్రశ్నిస్తున్నామని తెలిపారు.

# కొత్త లుక్‌లో జనసేనాని...

**విజయవాడ–సూర్య వాస్తవం :** పొలిటికల్ ట్రెండ్ సెట్టర్ పవన్ కళ్యాణ్. తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక స్టార్ డం ఉన్న హీరో. విపరీతమైన ఫ్యాన్ ఫాలో యింగ్ ఉంది. అయితే రాజకీ యాల్లోకి వచ్చిన పవన్ విజయం కోసం చాలా రోజులు వెయిట్ చేయాల్సి వచ్చింది. అయితే ఆయన హావభావాలు, వస్త్రధారణ విభిన్నంగా ఉంటుంది. ఒక్కోసారి ఒక్కో స్టైల్ లో కనిపిస్తున్నారు. అయితే సాధా రణంగా రాజకీయ పార్టీల నేతలు దోతి వంటి వాటిలో ఎక్కువగా కనిపిస్తారు. ఖద్దరుదారణ కూడా చేస్తారు కానీ పవన్ కళ్యాణ్ ఇటీవల డిఫరెంట్ లుక్ లో కనిపిస్తున్నారు. క్యాజువల్ డ్రెస్సెస్ తో పాటు కార్పొరేట్ లుక్ తో కనిపిస్తున్నారు. ఇప్పుడు ఇది అందరిలోనూ ఆశ్చర్యం వేస్తోంది. సహజంగానే సినీ పరిశ్రమ నుంచి రావడంతో ఫుల్ గ్లామర్ పవన్ కళ్యాణ్ ది. అటువంటిది ఇప్పుడు రాజకీయ నాయకుడిగా కాకుండా.. ఓ కార్పొరేట్ ఉద్యోగి తరహాలో కనిపిస్తున్నారు పవన్.సినిమా రంగంలో అగ్ర కథానాయకుడిగా కొనసాగారు పవన్ కళ్యాణ్. ఆయనది చరిష్మ ఉన్న ముఖం. అయితే అంతటి స్టార్ డం ఉన్న పవన్ కళ్యాణ్ రాజకీయ పార్టీ ఏర్పాటు చేసేసరికి ఒక సాధారణ రాజకీయ నాయకుడిగా మారిపోయారు. కుర్తాతో ఎక్కువగా కనిపించేవారు. ఆపై మెరిసిన గడ్డంతో, తల జిత్తుతో ఎక్కువగా బయటకు వచ్చేవారు. అయితే ఇటీవల మాత్రం ఆయన హెయిర్ స్టైల్ లో మార్పు వచ్చింది. క్యాజువల్ ఫ్యాంట్, షర్ట్ లో అఫీషియల్ లుక్‌లో కనిపిస్తున్నారు. క్యాబినెట్ సమావేశాలతో పాటు ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు అలానే వస్తున్నారు. ఈ న్యూ లుక్‌ను ఆయన ఎంత మజా చేస్తున్నారో తెలియదు కానీ.. జనసైనికులు మాత్రం చాలా ఆనందంతో గడుపుతున్నారు.అయితే ప్రజలతో పాటు జనసైనికులు పవన్ కళ్యాణ్ విషయంలో రెండు పద్ధతుల్లో ఫీల్ అవుతుంటారు. ఒకటి అభిమాన కథానాయకుడు, ఆపై ఇష్టమైన నేత. అందుకే పవన్ కళ్యాణ్ ఎక్కడికి వెళ్లినా అదే క్రేజ్. చివరకు మంత్రివర్గ సమావేశాలు అయినప్పుడు, మంత్రులు ప్రత్యేకంగా కలుసుకున్నప్పుడు పవన్ కళ్యాణ్ తో ఫోటోలు దిగేందుకు తోటి మంత్రులు కూడా ఆసక్తి చూపుతుంటారు. అంతలా ఉంటుంది ఆయన చరిష్మ. ఆపై ప్రజల విషయంలో ఆయన వ్యవహార శైలి కూడా అలానే ఉంటుంది. చాలా అంకితభావంతో పనిచేస్తారు. అయితే గత కొంతకాలం కిందట వరకు ఆయన సాధారణ వస్త్రాలతోనే కనిపించేవారు. కానీ ఇటీవల అఫీషియల్ లుక్ తో కనిపి స్తున్నారు. ఇది జనసైనికులకు ముమ్మాటికి ఇష్టపడే విషయం కూడా. అయితే పవన్ కళ్యాణ్ ఎలా ఉన్నా ప్రత్యర్థులకు నచ్చదు. ఎందుకంటే ఆయన వారి ఓటమిపై అంతలా ప్రభావం చూపారు కాబట్టి. అందుకే ఆయన అదిరేటి డ్రెస్ వేసినా వారికి నచ్చదు. అభిమానులు మాత్రం పవన్ కళ్యాణ్ ను చూసి ఫిదా అవుతున్నారు.



# సంక్రాంతి వేళ అప్రమత్తత అవసరం

- దొంగతనాల నివారణకు డీఎస్పీ సూచనలు




**ప్రొద్దుటూరు సూర్య వాస్తవం :** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పండుగ సెలవుల్లో సొంత ఊర్లకు వెళ్లే వారు తమ విలువైన సొత్తు మరియు నివాసాల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని డిఎస్పి పి భావన కోరారు. నేరాల నియంత్రణ మరియు దొంగతనాలు అరికట్టడమే లక్ష్యంగా పలు కీలక సూచనలు జారీ చేశారు. ఊర్లకు వెళ్లే వారు తమ ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదు మరియు ఇతర విలువైన సామాగ్రిని ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని కోరారు.ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం శ్రేయస్కరం అన్నారు. ఇది పగలు మరియు రాత్రి సమయాల్లో జరిగే అవాంఛనీయ సంఘటనలను గుర్తించడంలో పోలీసులకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు.పండుగకు ఊర్లకు వెళ్లే వారు తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం అందించాలని సూచించారు. ఇంటికి తాళం వేసినట్లు బయట వ్యక్తులకు స్పష్టంగా తెలియకుండా జాగ్రత్త పడాలని నమ్మకస్తులైన పొరుగు వారికి సమాచారం ఇచ్చి వెళ్లాలని కోరారు. మీ పరిసరాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే డయల్ 100/112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు.ప్రస్తుతం జిల్లాలో ప్రజల దృష్టి మళ్లించి దొంగతనాలకు పాల్పడే 'అటెన్షన్ డైవర్షన్ ముఠాలు తిరుగుతున్నట్లు సమాచారం ఉందని, ముఖ్యంగా వారపు సంతలు, బ్యాంకులు, గ్రామ ఉత్సవాలు మరియు రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాల్లో ఈ ముఠాలు చురుగ్గా ఉండే అవకాశం ఉందన్నారు. ప్రయాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఇచ్చే ఆహారం, పానీయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోకూడదని బ్యాంకుల వద్ద లేదా రద్దీ ప్రదేశాల్లో ఎవరైనా మీ దుస్తులపై మురికి పడిందని చెప్పినా, డబ్బులు కింద పడ్డాయని చెప్పినా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజల రక్షణే మా ప్రాధాన్యత పోలీసు యంత్రాంగం నిరంతరం నిఘా ఉంచుతుందని ప్రజలు పోలీసులతో సహకరించి, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పండుగను సురక్షితంగా జరుపుకోవాలని తెలిపారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )